ANDHRA JYOTI, Vijayawada. Regd. No. H 549

ఉదయం 122284

Telephone: 4343



ఆంధ్రజ్యోతి

ఎడిటర్: నార్ల వెంకటేశ్వరరావు

సంపుటి 7 :: సంచిక 236 | విజయవాడ, ఫిబ్రవరి 27, 1967 సోమవారం | 6 పేజీలు :: 12 పైసలు

లోకసభలో కాంగ్రెసుకు పూర్తి మెజారిటీ

మొత్తం 521 స్థానాలలో ఆదివారం సాయంత్రంవరకు 270 లభ్యం

ఆంధ్రప్రదేశ్‌లో ఆరు మినహాగా తక్కిన అన్ని స్థానాలు కాంగ్రెసువాదుల కైవసం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 —

521 స్థానాలుకల లోకసభలో కాంగ్రెస్ 270 స్థానాలను గడించి పూర్తి మెజారిటీని సంపాదించుకున్నది. మరి 21 స్థానాల ఫలితాలు వెల్లడి కావలసివున్నాయి.

లోకసభకు ఇప్పటివరకు ప్రకటించిన స్థానాలలో కాంగ్రెస్ 263 స్వతంత్రపార్టీ 43, జనసంఘం 34 మితవాద కమ్యూనిస్టు పార్టీ 20. అతివాద కమ్యూనిస్టు పార్టీ 19 ఎస్.ఎస్.పి. 23 పి.ఎస్.పి. 8 డి.ఎం.కె.25 రిపబ్లికన్ పార్టీ ఒకటి. ఇండిపెండెంట్లు 33 ఇతర పార్టీలు 11 స్థానాలను గెల్చాయి.

మైసూర్ రాష్ట్రం నుంచి లోకసభకుగల 27 స్థానాలలో కాంగ్రెసు 18, స్వతంత్ర పార్టీ ఆయిదు. పి. ఎస్. పి. రెండు ఎస్.ఎస్.పి. ఒకటి, ఇండిపెండెంట్లు ఒకటి స్థానాన్ని గెల్చారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి లోకసభకు గల 41 స్థానాలలో కాంగ్రెసు 35 స్థానాలను గెల్చుకున్నది. కమ్యూనిస్టులు ఒకటి, స్వతంత్రపార్టీమూడు,ఇండిపెండెంట్లు రెండు స్థానాన్ని గెల్చారు.

మద్రాస్ రాష్ట్రంనుంచి లోకసభకు గల 39 స్థానాలలో ద్రవిడ మున్నేట్ర కజగం 25 స్థానాలను, కాంగ్రెస్ మూడు, స్వతంత్రులు, అతివాద కమ్యూనిస్టులు నాలుగు, ఇండిపెండెంట్లు ఒక స్థానం గెల్చారు.

యు. పి. లోని మహారాజ్‌గంజ్ లోకసభ నియోజకవర్గం నుంచి డాక్టర్ మహాదేవ్ ప్రసాద్ (కాంగ్రెసు) ఎన్నికయినారు.

బీహార్‌లోని కిషన్‌గంజ్ నుంచి లోకసభకు శ్రీ లఖన్‌లాల్ కపూర్ (పి.ఎస్.పి) ఎన్నికయినారు.

బీహార్‌లోని సహర్సా నుంచి లోకసభకు గుణానంద్ ఠాకూర్ (ఎస్. ఎస్. పి.) ఎన్నికయినారు.

హాపుర్ నుంచి శ్రీ ప్రకాశ్‌వీర్‌శాస్త్రి ప్రస్తుత ఎం. పి. తిరిగి ఎన్నికయినారు.

కూచ్‌బీహార్ నుంచి లోకసభకు శ్రీ తులాకామ్ (కాం) ఎన్నికయ్యారు.

మండి నుంచి లోకసభకు శ్రీ లలితసేన్ (రాం) ఎన్నికయినారు.

బీహార్‌లోని డుమ్కా లోకసభ నియోజకవర్గంనుంచి శ్రీ సత్యచరణ్‌బుస్రా (కాం) ఎన్నికయినారు.

అస్సాంలోని లఖింపూర్ నియోజకవర్గం నుంచి శ్రీ విశ్వనారాయణశాస్త్రి (కాం) ఎన్నికయినారు.

బాన్స్‌గామ్ నుంచి లోకసభకు శ్రీ మోలాకరు (ఎస్.ఎస్. పి.) ఎన్నికయినారు.

ధేంకనాల్ నియోజకవర్గంనుంచి లోకసభకు రాజాకామాక్ష్య ప్రసాద్ సింగ్‌దేవ్ మహేంద్ర బహదూర్ (స్వతంత్ర) ఎన్నికయినారు.

భువనేశ్వర్ నియోజకవర్గంనుంచి లోకసభకు శ్రీ చింతామణి పాణిగ్రహి ఎన్నికయినారు.

పెహగర్వాల్ నియోజకవర్గం నుంచి మహారాజ మానవేంద్రషా (కాం) ఎన్నికయినారు.

భగారియా నియోజకవర్గంనుంచి శ్రీకామేశ్వరసింగ్ (పి.ఎస్.పి.) కన్నికయినారు

కాప్‌గంజ్ నియోజకవర్గం నుంచి ముషీర్ అహ్మద్‌ఖాన్ (కాం) ఎన్నికయినారు.

రైల్వేశాఖ స్టేట్ మంత్రి డాక్టర్ రామ్ సుభగ్ సింగ్ బక్సార్ నియోజకవర్గం నుంచి లోకసభకు ఎన్నికయినారు. వీరు ఎస్. ఎస్. పి. అభ్యర్థి శ్రీ రాధామోహన్ సింగ్‌ను 33 వేల ఓట్ల మెజారిటీతో ఓడించారు.

యు. పి. లోని దేహారియా నియోజకవర్గం నుంచి లోకసభకు శ్రీ విశ్వనాథ్‌రాయ్ (కాం) ఎన్నికయినారు.

కొంతి పార్లమెంటరీ నియోజక వర్గం నుంచి శ్రీ జై పాల్‌సింగ్ (కాం) గెలిచారు.

బహరైచ్ నుంచి లోకసభకు శ్రీ కరుణకృష్ణ నాయర్ (జనసంఘం) ఎన్నికయినారు.

(మిగతా 3 వ పేజీలో)

లోకసభ ఫలితాలు

ఆదివారం ఉదయం
వివిధ పక్షాల బలాబలాలు

మొత్తం సీట్లు	521
వెలువడిన ఫలితాలు	479
కాంగ్రెసు	262
స్వతంత్ర పార్టీ	43
జనసంఘం	34
రైట్ కమ్యూనిస్టు	2
లెఫ్టు కమ్యూనిస్టు	19
ఎస్. ఎస్. పి.	23
పి. ఎస్. పి.	8
డి. ఎం. కె.	25
రిపబ్లికన్	1
ఇండిపెండెంట్లు	23
ఇతర పార్టీలు	11

ధరావత్తులు కోల్పోయిన వారు

రాజస్థాన్‌లో 480 మంది

జైపూర్, ఫిబ్రవరి 26 — రాజస్థాన్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల ఫలితాలనుబట్టి పోటీ చేసిన అభ్యర్థులలో మొత్తం 480మంది ధరావత్తులు కోల్పోయారు. వారిలో 379 మంది ఇండిపెండెంట్లు.

184 మంది సభ్యులు గల రాజస్థాన్ అసెంబ్లీకి మొత్తం 892 మంది అభ్యర్థులు పోటీ చేశారు.

రిపబ్లికన్, పి. ఎస్. పి., కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులలో చాలామంది ధరావత్తులు కోల్పోయారు. ఆరుగురు రిపబ్లికన్ అభ్యర్థులు, 16 మంది మితవాద కమ్యూనిస్టు అభ్యర్థులు ధరావత్తులు కోల్పోయారు.

నొవస్కోటియా కేప్ బ్రెటన్ దీవివద్ద టాలర్ ఐస్‌లాండ్ నౌకదడ్డుకు తాకడం వల్ల పదిమంది నౌకా సిబ్బంది మరణించారని హాలీఫాక్స్ వార్త.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ నాయకుని ఎన్నిక సమస్య

ఉభయవర్గాలకుచెందిన వారిలో తీవ్ర సమాలోచనలు

పోటీ విషయమై నిర్ణయానికి రాబోయేముందు కొత్త సభ్యులతో చర్చించాలని శ్రీ ఎ సి. వివరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, ఫిబ్రవరి 26—

ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ నాయకుని ఎన్నిక వచ్చే గురువారంనాడు జరగాలని నిర్ణయం కాగా, కాంగ్రెసు రెండు వర్గాలు భావి కార్యక్రమంపై తీవ్ర సమాలోచనలు సాగిస్తున్నాయి.

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి తన సహచరులతో అధికార గృహం "ఆనంద నిలయం"లో విస్తృత సంప్రతింపులు జరుపుతున్నారు. ఆయన ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ పి. బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీ వి. బి. రాజు ప్రభృతులతో చర్చలు జరుపుతున్నారు.

పెక్కుమంది కాంగ్రెసువాదులు వచ్చి ముఖ్యమంత్రిని కలుసుకుంటున్నారు. వారిలో అసెంబ్లీకి కొత్తగా ఎన్నికయిన సభ్యులు ఎక్కువగా వున్నారు.

సయోధ్యవర్గం నాయకుడు శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి అధికార గృహం "పేరువాకా"లో తన మిత్రులతో, అభిమానులతో సమాలోచనలు జరుపుతున్నారు.

పార్టీ నాయకత్వానికి సయోధ్యవర్గం పోటీ పెడుతుందో లేదో సూచనప్రాయంగా కూడా ఇంకా ఏమీ తెలియరాలేదు.

కాని, శ్రీ సుబ్బారెడ్డి నిన్న పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో నైతేనేమి, మరొక రాష్ట్రంలో నైతేనేమి, చిట్టచివరకు కేంద్రంలో నైతేనేమి నాయకుని ఎన్నిక ఏకగ్రీవంగా జరగాలని శ్రీ సంజీవరెడ్డి చేసిన సూచన గురించి తన మిత్రులతో సంప్రతింపులు జరుపుతున్నట్టు తెలిపారు.

శ్రీ సుబ్బారెడ్డి నేడు "ఆంధ్రజ్యోతి" ప్రతినిధితో జరిపిన ఇంటర్వ్యూలో అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన వారిలో ఇంకా కొందరు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రాజధానికి రావలసి వున్నదని, తాను వారి రాకకై ఎదురు చూస్తున్నానని, వారితో సంప్రతింపులు జరిపిన తర్వాత రానున్న రెండు రోజులలోపు పార్టీ నాయకత్వాని పోటీ చేయడమా, లేదా అన్న విషయమై నిర్ణయాన్ని గైకొనగలమని తెలిపారు.

అయితే, పార్టీ నాయకత్వానికి సయోధ్యవర్గం నుంచి పోటీ వుండకపోవచ్చునని ఇక్కడ అభిజ్ఞ వర్గాలు సూచిస్తున్నాయి.

శ్రీ బ్రహ్మానందరెడ్డి పార్టీ నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నిక కాగల అవకాశాలు కనిపిస్తున్నవని వారు అంటున్నారు.

కాగా, శ్రీ బ్రహ్మానందరెడ్డి ఏకగ్రీవంగా నాయకత్వానికి ఎన్నికైన పక్షంలో మరింత క్లిష్టస్థితిని ఎదుర్కొనవలసి రాగలదని వారు అభిప్రాయపడుతున్నారు.

పార్టీలో ని అన్నివర్గాలకు మంత్రివర్గంలో తగు ప్రాతినిధ్యమిచ్చి, వారిని కలుపుకొని వెళ్ళవలసిన గురుతరమైన బాధ్యత ఆయనపై పడిగలదని వారు పేర్కొన్నారు.

వాస్తవానికి శ్రీ బ్రహ్మానందరెడ్డి ఇప్పటికే తనవర్గం సభ్యులనుంచి మంత్రిపదవులకోసం వస్తున్న పెక్కువాద, ప్రతివాదాలను ఎదుర్కొనవలసివస్తున్నట్టు వారు తెలియజేశారు.

పార్టీ నాయకత్వం

శ్రీ సుబ్బారెడ్డి పోటీచేసే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 — రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ నాయకత్వానికి పోటీ చేసే అవకాశాలు లేకపోలేదు.

ఈ విషయమై పత్రికా ప్రతినిధులు ఆయనను ప్రశ్నించగా తమ మిత్రులతో సంప్రతించవలసి ఉన్నదని ముఖ్యమంత్రి వలె తాను సర్వాధికారిని కానని అన్నారు.

నెల్లూరుజిల్లాలో ఎన్నికల గురించి అడుగగా ధనికులు మధ్యతరగతి ప్రజల మధ్య పోటీఅని ఈ అసమానత్వపు పోరాటంలో మధ్యతరగతి వారు ఓడిపోవడం జరుగుతూ ఉంటుందని శ్రీ సుబ్బారెడ్డి అనారు.

శ్రీ చెంచు రామానాయుడు, శ్రీ జి. సి. కొండయ్య, శ్రీ వి. గోపాలరెడ్డి మామ, వెంకటగిరిరాజాలు, అభ్రకం గనుల యజమానులు ఈఎన్నికలలో తమకువ్యతిరేకంగా పనిచేశారని శ్రీ సుబ్బారెడ్డి అన్నారు.

ఆఫ్రికా, ఆసియా రాష్ట్రాల ఆరిక సహకార సంఘ సమావేశం కరాచీలో సమావేశమై ఈ ఖండాలలో లఘుపరిశ్రమల అభివృద్ధికి తోడ్పడవలెనని సభ్యత్వ కోరినట్టు కరాచీ వార్త.

లోకంతీరు



"వారిద్దరూ ఎవరయ్యా. అలా పరిగెత్తుతున్నారు ?"
"ఓడిపోయిన అభ్యర్థి. జ్యోతిష్కుడు అయి వుంటారు !"

పంజాబ్‌లో కొత్త ప్రభుత్వం

కాంగ్రెస్‌ను ఏర్పరచనివ్వడం తగునని జనసంఘ సభ్యుని అభిప్రాయం

జలంధర్, ఫిబ్రవరి 26— కొత్తశాసనసభలో మిగతా పార్టీల కన్నా ఎక్కువ స్థానాలు సంపాదించిన కాంగ్రెసుకు ప్రభుత్వాన్ని ఏర్పరచే అవకాశాన్ని ఇవ్వడం తగనని జనసంఘ సభ్యులు శ్రీ మన్‌మోహన్ కాలియాఅన్నారు.

శ్రీ కాలియా ఈ ఎన్నికలలో పంజాబ్ ఆహారం సప్లయిస్ శాఖమంత్రి శ్రీ యాషను ఓడించారు. ఏడేడైనప్పటికి శ్రీ గురుముఖ్ సింగ్ ముసాఫిర్ తిరిగి ముఖ్యమంత్రి అవడం తగదని ఆయన అన్నారు. ప్రజలు గురుముఖ్ సింగ్ ముసాఫిర్‌కు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పును కాంగ్రెసు గౌరవించగలదని తాను ఆశిస్తున్నానని ఆయన అన్నారు.

పంజాబ్‌లో ప్రతిపక్షాలు మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తే అదిసరిగా పనిచేయలేదేమోనని ఆయన అన్నారు.

రాజకీయ పరిస్థితిపై కాంగ్రెసు అధ్యక్షునితో ప్రధాని ఇందిర చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 —

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి నేడిక్కడ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్‌తో అరగంటసేపు చర్చలు జరిపారు

దేశంలో రాజకీయ పరిస్థితిని గురించి రేపు జరుగనున్న కాంగ్రెసు కేంద్ర పార్లమెంటరీ బోర్డు, వర్కింగ్ కమిటీల సమావేశపు ఎజెండానుగురించి తాను కామరాజ్‌తో చర్చించినట్టు ప్రధాని తెలిపారు.

శ్రీ కామరాజ్‌తో శ్రీ మురార్జీ భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 — శ్రీ మురార్జీ దేశాయ్ నేటి సాయంత్రం ఇక్కడి కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్‌ను కలుసుకుని ఎదినిమిషాలసేపు సంభాషణలు జరిపారు.

ఇది కేవలం మర్యాద పూర్వకంగా జరిగిన సమావేశమేనని, దానికి రాజకీయ ప్రాముఖ్యం లేదని వారిద్దరు అన్నారు.

కాశ్మీర్ అసెంబ్లీకి బక్షీ ఎన్నిక

శ్రీనగర్, ఫిబ్రవరి 26 — సఫ్‌కాదల్ నియోజకవర్గంనుంచి కాశ్మీర్ అసెంబ్లీకి జాతీయ మహాసభ నాయకుడు బక్షీ ఘులాం మహమ్మద్ ఎన్నికయ్యారు.

ఆయన కాంగ్రెసు అభ్యర్థి ఘులాం మొహియుద్దీన్‌ను ఓడించారు.

కాశ్మీర్‌లోని హబ్బాకదల్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి కాంగ్రెసు అభ్యర్థి శ్రీ కాంత్‌కౌల్ ఎన్నికయ్యారు.

ఒరిస్సా ఉపముఖ్యమంత్రి రాజీనామా ఆమోదం

భువనేశ్వర్, ఫిబ్రవరి 26—ఎన్నికలలో ఓడిపోయిన ఒరిస్సా ఉపముఖ్యమంత్రి శ్రీ నీలమణిరౌత్‌రాయ్, వ్యవసాయశాఖ ఉపమంత్రి శ్రీ మదన్ మోహన్ పురాన్ రాజీనామాలను రాష్ట్ర గవర్నర్ డాక్టర్ ఖోస్లా అంగీకరించినట్టు వార్త అందింది.

పశ్చిమ బెంగాల్‌లో కొత్త మంత్రివర్గ నిర్మాణం సమస్య

చర్చలకై బంగ్లా కాంగ్రెసు నాయకుడు అజయ్‌కుమార్ ముఖర్జీకి గవర్నర్ పిలుపు

కలకత్తా, ఫిబ్రవరి 26—

పశ్చిమ బెంగాల్ గవర్నర్ మిస్ పద్మజా నాయుడు చర్చలకై తనను రేపు ఉదయం రాజభవన్‌లో కలుసుకోవలసిందిగా పది మూడు పార్టీల ఐక్య సంఘటన నాయకుడు శ్రీ అజయ్ కుమార్ ముఖర్జీని ఆహ్వానించారు.

ఈ విషయాన్ని ఇక్కడ బంగ్లా కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

నిన్న కలకత్తాలో ఏర్పాటైన పదమూడు పార్టీల ఐక్యసంఘటనకు శ్రీ అజయ్‌కుమార్ ముఖర్జీ నాయకుడుగా ఎన్నికయ్యారు.

శ్రీ ముఖర్జీ నాయకత్వాన కాంగ్రెసేతర నూతన మిశ్రమ మంత్రివర్గం మార్చి ఏడవ తేదీలోగా అధికారాన్ని చేపట్టవచ్చునని తెలుస్తున్నది.

గవర్నర్ ఆహ్వానాన్ని పురస్కరించుకొని శ్రీ ముఖర్జీ రేపు ఉదయం గవర్నర్ మిస్ పద్మజా నాయుడును కలుసుకొంటారు.

రాష్ట్రంలో కాంగ్రెసేతర మంత్రి వర్గ నిర్మాణపకాశాలు గురించి ఆయన గవర్నరితో చర్చిస్తారు.

పదిమూడు పార్టీలతో కూడిన సంఘటన నాయకుడుగా శ్రీ ముఖర్జీ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఆ సంఘటనలో పీపుల్స్ యునైటెడ్ ఫ్రంట్, ఐక్య వామసంఘటన, ఇతర వామపక్షాలు, ఇండిపెండెంట్లు వున్నారు.

న్యూఢిల్లీలో రాష్ట్రపతితో, ప్రధానితో చర్చలు జరిపిన తర్వాత గవర్నర్ మిస్ పద్మజా నాయుడు నేటి ఉదయం తిరిగి ఇక్కడికి వచ్చారు.

పశ్చిమ బెంగాల్‌లో నూతన మంత్రివర్గ నిరాణానికి తన సంసిద్ధతను ప్రకటిస్తూ ప్రతిపక్షాల ఐక్యసంఘటనవారు వ్రాసినలేఖ గవర్నర్‌కు చేరింది.

రాష్ట్ర శాసనసభలో ఐక్య సంఘటనకు పూర్తి మెజారిటీ కలదని ప్రభుత్వాన్ని నిర్మించడానికి అది సంసిద్ధంగా వున్నదని ఆ లేఖ తెలుపుతున్నది.

ప్రతిపక్షాల ఐక్య సంఘటన మొత్తం బలం 161, కాంగ్రెసు పార్టీ బలం 127. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో మొత్తంసభ్యుల సంఖ్య 280.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధ్యక్షుడు శ్రీ ఎన్. ఎస్. కాశ్యప్ ఫిబ్రవరి 25వ తేదీన మాట్లాడుతూ గుజరాత్ పెట్రోలియం కర్మాగారాల మార్పినుంది ఇరవై లక్షల టన్నుల పూర్తి ప్రమాణంమేరకు పని చేయగలదని ప్రకటించినట్టు బరోడా వార్త.

మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ
వోటరు మహాశయులకు
కృతజ్ఞతాభివందనాలు

సహోదరులారా!
మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెసు అభ్యర్థినైన నాకు తమపవిత్ర మైనఓట్లనిచ్చిఅఖండవిజయం కూర్చి ప్రజాసేవ చేయు అవకాశ మొసంగినందుకు మరల నా కృతజ్ఞత తెలుపుచున్నాను కాంగ్రెసు విజయమునకై అవిరళ కృషి సల్పిన కర్యకర్తలకు, తదితరపెద్దలకు కృతజ్ఞతాభివందనములర్పించుచున్నాను.

చల్లపల్లి
26-2-67

మీ
యార్లగడ్డ
అంకినీడు ప్రసాద్

గుడివాడ లోకసభ నియోజకవర్గం
ఓటరు మహాశయులకు
కృతజ్ఞతాభివందనాలు

గుడివాడ పార్లమెంటరీ నియోజకవర్గంనుంచి లోకసభకు జరిగిన ఎన్నికలలో నాకు విజయము చేకూర్చి, మీరందరికి సేవచేయగల సదవకాశం కల్పించిన గుడివాడ, ముదినేపల్లి, కైకలూరు మల్లేశ్వరం, పయ్యారు, కంకిపాడు, గన్నవరం అసెంబ్లీనియోజకవర్గాల ఓటరు మహాశయులకు, నా విజయానికి అహర్నిశృషి చేసిన కాంగ్రెసు కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు, తదితర పెద్దలకు నా హృదయపూర్వకాభివందనాలు.

—: త్వరలో మీ అందరిని కలుసుకొనగలవాడను :—

ఇట్లు,
మీ
మాగంటి అంకినీడు.

గుడివాడ.
26-2-67.

1967 ఫిబ్రవరి 27 సోమవారం
శ్రీ పరాభవనామ సంవత్సర
మాఘ బహుళ తదియ
తదియ : సా॥ 5-11 హస్త : రా॥ 9-19
వర్జ్యం : ఉ॥ 6-55 నుంచి 8-24 వరకు
" రా॥ 4-45 " 6-14 "

• • •

1967 ఫిబ్రవరి 28 మంగళవారం
శ్రీ పరాభవనామ సంవత్సర
మాఘ బహుళ చవితి
నవితి : సా॥ 2-38 చిత్త : రా॥ 7-31
వర్జ్యం : రా॥ 12-45 నుంచి 2-15 వరకు

ఆంధ్రజ్యోతి

"తమసో మా జ్యోతిర్గమయ"

ఎన్నికల ఫలితాల సరళి-1

ఈ ఎన్నికలలో కాంగ్రెసు గెలిచిందా? ఓడిందా? నిష్పాక్షికంగా ఎవరైనా ఇందుకు చెప్పగల సమాధానం "ఓడింది" అని మాత్రమే.

ఆంధ్రప్రదేశ్‌లో, మైసూరులో, మహారాష్ట్రలో, గుజరాత్‌లో, అస్సాంలో, హరియానాలో, మధ్యప్రదేశ్‌లో— ఈ ఏడు రాష్ట్రాలలో దానికి మెజారిటీ లభించి వుండవచ్చు. స్వతంత్రులను కొందరిని కూడగట్టుకుని రాజస్థాన్‌లో అది తిరిగి మంత్రివర్గాన్ని నిర్మించవచ్చు; పంజాబ్‌లో కూడా ఇంతే చేయవచ్చు. కేంద్రపాలిత ప్రాంతాలైన త్రిపురలో, హిమాచల్ ప్రదేశ్‌లో అది విజయాన్ని పొందివుండవచ్చు. లోకసభలో దానికి ఎంతో కొంత సంఖ్యాబలం లభించి వుండవచ్చు.

అయినా, "కాంగ్రెసు సగం గెలిచింది, సగం ఓడింది" అని సరిపెట్టుకోడానికి ఎంత మాత్రం వీలులేదు. ఓట్లదృష్టి నుంచికాక, సీట్లదృష్టినుంచి కాక, నైతిక దృష్టి నుంచి చూస్తే, కాంగ్రెసు సంపూర్ణంగానే పరాజయం చెందింది!

ఎన్నికల ఫలితాలను చర్చించే సందర్భంలో ఓట్లను— అవి తెచ్చిన సీట్లను— పరిగణించనక్కరలేదని చెప్పడం వింతగా, విడ్డూరంగా తోచవచ్చుగాని, దీర్ఘంగా, ప్రశాంతంగా ఆలోచన చేస్తే, దీనిలో వింతలేదు, విడ్డూరం అంతకంటె లేదు

కాంగ్రెసుకు లభించిన పాక్షిక విజయమైనా దానిపట్ల ప్రజలకున్న ప్రేమ గౌరవాల వల్ల, భక్తి విశ్వాసాలవల్ల కాదు; దాని స్థానాన్ని ఆక్రమించగల ప్రత్యామ్నాయ రాజకీయ పక్షం మరొకటి లేనందువల్లనే.

ఎన్నికలకు **ముందు** ఈ నెల 14 **వ** తేదీ సంచికలో మేము వ్రాసిన కొన్ని **భాగాలను కొంత** సుదీర్ఘంగానే **ఇక్కడ ఉదహరిస్తున్నందుకు** పాఠకులు మమ్ము మన్నించాలి:—

"కాంగ్రెసు పార్టీ క్షేమాన్ని, దాని ప్రతిష్ఠను, దాని భవిష్యత్తును పదిలపరచగోరేవారు ప్రస్తుతం దాని పరాజయాన్ని కోరాలి. వరసగా ఇంతకాలం రాజ్యాధికారంలో వున్నందున దానిలో చేరిన కశ్మలం క్షాళనం కావాలంటే కొంతకాలంపాటు అది అజ్ఞాతవాసం చేయాలి"

"కాంగ్రెసు పార్టీ రాజ్యాధికారాన్ని కోల్పోగానే దాని లక్ష్యాలలో, దాని విధానాలలో అణుమాత్రమైనా తమకు విశ్వాసం లేకపోయినా, అధికారాన్ని కోరి, దానికి సంబంధించిన పటాటోపాన్ని కోరి, స్వార్థాన్ని కోరి, దానిలో చేరిన వారందరు దానినుంచి తప్పుకుంటారు: స్వప్రయోజనాన్ని కోరి, దాన్ని సమర్థిస్తున్న వారందరు కూడా నూతన ప్రభుత్వాన్ని నిర్మించగల రాజకీయ పక్షాన్ని, లేదా పక్షాలను అభిమానిస్తారు. ఈ మార్పులతో కాంగ్రెసు సంఖ్యాబలం పూర్తిగా తగ్గుతుంది కాని, ఇదే సమయంలో అది తన ప్రస్తుత దౌర్బల్యాలను, దౌర్భాగ్యాలను కోల్పోయి తన పూర్వపు ప్రతిష్ఠను, పవిత్రతను తిరిగి చాలావరకు సంతరించుకోగలుగుతుంది".

"ఇందువల్ల కాంగ్రెసు పార్టీ దృష్టినుంచి దాని హితచింతకులు ప్రస్తుతం దాని పరాజయాన్నే కోరుకోవాలి. కాని, దేశం దృష్టి నుంచి మాత్రం ఈ కోర్కె ప్రమాదభరితమైంది కాదా? ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నిర్మించగల స్థోమత ఏ ఒక్క పార్టీకి పూర్తిగా లేనప్పుడు కలగాపులగం మంత్రివర్గాలు దేశాన్ని మరింత చిక్కులపాలు చేయవా?"

ఈ వాక్యాలలోగల శ్లోస్యం ఈనాడు చాలావరకు నిజం కాలేదా? ఒక మద్రాసు రాష్ట్రం విషయంలో మాత్రమే ఒక ప్రతిపక్షం (డి ఎం. కె) స్వశక్తిపై ఆధారపడి మంత్రివర్గాన్ని నిర్మించగల స్థితిలో నేడు కనబడుతున్నది. కాగా, కాంగ్రెసుకు మెజారిటీరాని తక్కిన రాష్ట్రాలలో ఏర్పడగలిగినవి కలగాపులగం ప్రభుత్వాలే. ఒరిస్సాలో అది రెండు పార్టీల కలగాపులగం. కేరళలో ఏడు పార్టీల కలగాపులగం. పశ్చిమ బెంగాల్‌లో పదమూడు పార్టీల కలగాపులగం.

కేరళలో, ఒరిస్సాలో ఇదివరలో మిశ్రమ ప్రభుత్వాలు నెలకొనగా అవి ఎంతోకాలంపాటు సాగలేదు; సాగిన కొంత కాలంలో సయితం అంతరంగిక విభేదాలు, సంఘర్షణలు తప్పలేదు. ఇదివరలో విఫలమైన ప్రయత్నం ఈసారి జయప్రదం కాగలదా? ఏమో, సందేహమే!

కేరళలో, ఒరిస్సాలో మిశ్రమ మంత్రివర్గాల వైఫల్యం తర్వాత కూడా ఆ రాష్ట్రాల ప్రజలు కాంగ్రెసును ఈసారి గెలిపించలేదంటే దాని తాత్పర్యం "ఎంతటి పంచకూళ్ల కషాయం ప్రభుత్వమైనా, కాంగ్రెసు ప్రభుత్వం కంటె మెరుగైనదే కాగల"దని అక్కడి ప్రజలు తీర్మానించుకున్నారనే కాదా? ఇట్టి తీర్మానానికే మరికొన్ని రాష్ట్రాల ప్రజలు రావడం కాంగ్రెసుకు పూర్తి నైతిక పరాజయం కాకపోతే మరేమిటి?

కాంగ్రెసుపట్ల ప్రజల ప్రేమాదరాలు హఠాత్తుగా సడలిపోలేదు; దానిపట్ల వారి భక్తి విశ్వాసాలు ఆకస్మికంగా సన్నగిలలేదు ఇది క్రమానుగతంగా జరుగుతూ వచ్చింది. అయినా, రాజ్యాధికారం తమ కన్నుగప్పిన కారణాన కాంగ్రెసుకు చెందినవారు— ముఖ్యంగా దాని నాయకులు— ఈ విషయాన్ని కానలేక పోయారు. లైసెన్స్‌ల కోసం, పర్మిట్లకోసం, కోటాలకోసం, కాంట్రాక్టుల కోసం తమను చుట్టుముటి వుండే గుంపులను చూచి, వారే ప్రజలని భ్రమపడ్డారు. తమ అధికార బలం, తమ ఆర్థిక బలం— ఇవే తమకు తిరిగి విజయాన్ని చేకూర్చగలవని భ్రమపడ్డారు. గాంధి, నెహ్రూల పేర్లు తారక మంత్రాలవలె తిరిగి తమను తరింపజేయగలవని భ్రమపడ్డారు. ఈ భ్రమలు కనీసం కొన్ని ప్రాంతాలలో— కనీసం కొందరి విషయంలో— పటాపంచలైపోయినందుకు కాంగ్రెసు హిత చింతకులు సంతోషించాలి.

ఒక సంస్థకు చెందినవారిపట్ల ప్రజలలో వైముఖ్యం ప్రబలినప్పుడు, ఆ వైముఖ్యం విచక్షణా రహితం కావడం కద్దు. కాంగ్రెసు నాయకులలో "నిప్పు" వంటివారు ఎవరైనా ఈనాడు వున్నారంటే, ఆయన శ్రీ కామరాజ్ మాత్రమే. అయినా, మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెసుపట్ల ప్రజలలో ప్రబలిన వైముఖ్యం ఆయన పరాజయానికి దారితీసింది. ఈ దృష్టి నుంచే శ్రీ కామరాజ్ పరాజయం ఎంతో శోచనీయమని మేము గత వారం ఒక సంపాదకీయంలో వ్రాయగా, దాన్ని కొందరు అపార్థం చేసుకున్నట్టు మాకు చేరిన కొన్ని లేఖలను బట్టి విదిత మౌతున్నది. నాడే కాదు, నేడు కూడా మా విశ్వాసం శ్రీ కామరాజ్‌ను పోలిన ఒక నిస్స్వార్థపరుడు, ఒక ఉన్నతలక్ష్య ప్రేరితుడు, ఒక రాజనీతి విశారదుడు, ఒక వ్యవహారదక్షుడు పరాజయం చెందడం యుక్తాయుక్త విచక్షణకే పరాజయం.

ఎన్నికల పిదప — భారత రాజకీయ రంగం

రెండు దశాబ్దాలుగా ఇండియాను ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన కాంగ్రెసుకు ఇంతవరకు ఏకైక జాతీయ సంస్థగా పేరుండేది ఇప్పుడది ఒక డజను చిల్లర మల్లర పార్టీలలో ఒకటిగా తయారయింది. నాల్గవ జనరల్ ఎన్నికల ప్రధాన ఫలితం ఇదే.

ఒక్కసారి కేరళలో మినహా ఇంతవరకు ఎన్నడు ఏ రాష్ట్రంలోను నాన్-కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పడలేదు. ఇప్పుడు పెద్దరాష్ట్రాలలో ఇతర పక్షాల ప్రభుత్వాలేర్పడబోతున్నాయి. నాల్గవ జనరల్ ఎన్నికల ఫలితాలలో గమనింపుకు వచ్చే రెండవ విశేషం ఇదే.

కేరళలో ఏడు పార్టీలు కలిసి ఏర్పరచిన యునైటెడ్ ఫ్రంటు ప్రభుత్వం రానున్నది. దీనిలో ఎఫ్ఎన భాగస్వాములు అతివాద కమ్యూనిస్టులు. వీరి సంఖ్య 33. కాంగ్రెసుకు 9 స్థానాలే లభించాయి. కాంగ్రెసును, తెలుగువాడు కాంగ్రెసును కలిపిమినహాయించిన, మిగిలిన పార్టీలు అత్యధిక స్థానాలు లభించడంవల్ల అక్కడ అతివాద ఎఫ్ఎన ప్రభుత్వం నులభంగా ఏర్పడుతుంది. అది ఎన్నాళ్ళు కొనసాగుతుందనేది వేరే సంగతి.

పశ్చిమ బెంగాల్ పరిస్థితి కూడా ఇంతే. 280 స్థానాలుగల అసెంబ్లీలో కాంగ్రెసు అతిపెద్దరాజకీయ పార్టీగా వచ్చింది కాని, దానికి 127 స్థానాలు మాత్రమే వచ్చి, పూర్తి మెజారిటీ రాలేదు. మార్క్సిస్టులకు 43, బంగ్లా కాంగ్రెసుకు 35, లైట్ కమ్యూనిస్టులకు 16, ఫార్వర్డు బ్లాకుకు 13 వచ్చాయి. మొత్తం 13 పార్టీలు కలిసి బంగ్లా కాంగ్రెసుకు చెందిన శ్రీ అజయ్ ముఖర్జీని నాయకుడుగా ఎన్నుకుని ప్రభుత్వం ఏర్పరచనున్నాయి.

మద్రాసులో భిన్నమైన పరిస్థితి వుంది. 234 మందిగల అసెంబ్లీలో కాంగ్రెసుకు 49 స్థానాలేరాగా, డి. ఎం, కె. పార్టీకి 139 స్థానాలు వచ్చాయి. అది ఏ ఇతర పార్టీల సహకారం లేకుండా స్వయంగానే ప్రభుత్వం ఏర్పరచనున్నది.

ఒరిస్సాలో పరిస్థితి పశ్చిమ బెంగాల్‌లో వలెనే వున్నది. మొత్తం 140 స్థానాలలో కాంగ్రెసుకు 28 రాగా, 49 స్థానాలు గెలిచిన స్వతంత్ర పార్టీ, 23 గెలుచుకున్న జన కాంగ్రెసు కలిసి ప్రభుత్వం ఏర్పరచబోతున్నాయి.

పోతే, రాజస్థాన్‌లో కాంగ్రెసుకు మొత్తం 184 స్థానాలలో 89 స్థానాలు వచ్చాయి. స్వతంత్ర పార్టీకి 49 జనసంఘానికి 22 వచ్చాయి. కొందరు ఇండిపెండెంట్లను కలుపుకుని కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పరచడానికి ప్రయత్నించవచ్చు.

యు. పి. లో ఇప్పటివరకు ఫలితాలు వెలువడిన 403 స్థానాలలో కాంగ్రెసుకు 137 మాత్రమే లభించాయి జనసంఘానికి 95 స్థానాలు, ఎస్. ఎస్. పి. కి 40 స్థానాలు వచ్చాయి, కాంగ్రెసు ఇక్కడ కూడా వారిని వీరిని కలుపుకుని ప్రభుత్వం ఏర్పరుస్తుందేమో తెలియదు.

బీహారులో కూడా కాంగ్రెసు పరిస్థితి ఇంతే: ఫలితాలు వెలువడిన 306 స్థానాలలో 122 కాంగ్రెసు, ఎస్. ఎస్. పి. 63, జనసంఘం 26, రైట్ కమ్యూనిస్టుపార్టీ 24, పి.ఎస్. పి. 18 గెలుచుకున్నాయి.

పంజాబులో మొత్తం 104 సీట్లలో 43 మాత్రమే కాంగ్రెసుకు. జనసంఘానికి రెండవ అకాలీ దళానికి 26 సీట్లు వచ్చాయి. కాంగ్రెసు ఇతరులను కలుపుకుని ప్రభుత్వం ఏర్పరచవచ్చు.

పైన ఎనిమిది రాష్ట్రాల పరిస్థితిని పేర్కొన్నాము. వీటిలో కేరళ, మద్రాసు, పశ్చిమబెంగాల్, ఒరిస్సాలు నాలుగింటిలో కాంగ్రెసు ప్రభుత్వం రాదని తేలిపోయింది. బీహారులో కూడా అనుమానమే. యు.పి., రాజస్థాన్, పంజాబులలో కాంగ్రెసు ఇతరపక్షాలనో, ఇండిపెండెంట్లనో కలుపుకుంటే ప్రభుత్వాలు ఏర్పరచగలదేమో. ఏమైనా ఇది త్వరలో సదూపేక్షమైన ఎన్నికల ఫలితాలను సమీక్షించనున్న కాంగ్రెసు వర్కింగ్ కమిటీ, పార్లమెంటరీ బోర్డులు చేసే నిర్ణయాలపై ఆధారపడివున్న విషయం.

కాంగ్రెసు రాష్ట్రాలు

మిగిలిన ఏడు రాష్ట్రాలలో కాంగ్రెసు ప్రభుత్వాలు నిశ్చయంగా ఏర్పడనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 287 స్థానాలలో కాంగ్రెసుకు 165 స్థానాలు వచ్చాయి. ఇది పూర్తి మెజారిటీ. ఇంతవరకు ప్రధాన ప్రతిపక్షంగా వుంటున్న కమ్యూనిస్టుల బలం బాగా తగిపోయింది. రైటు, లెఫ్టు పార్టీలను కలిపి 19 స్థానాలు మాత్రమే వచ్చాయి, స్వతంత్ర పార్టీ 29 సీట్లతో ప్రధాన ప్రతిపక్షం కానున్నది. జనసంఘం మూడు సీట్లు సంపాదించి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా కాలుపెట్టింది.

అస్సాంలో 126 స్థానాలలో కాంగ్రెసుకు 73 వచ్చాయి. గుజరాత్‌లో 167 స్థానాలలో 92 కాంగ్రెసుకు లభించాయి. కాని ప్రధానప్రతిపక్షంగా 66 సీట్లు గెలుచుకున్న స్వతంత్ర పార్టీ వచ్చింది. హర్యానాలో 81 సీట్లకు 48 కాంగ్రెసుకు రాగా, ప్రధాన ప్రతిపక్షంగా జనసంఘం 12 సీట్లు గెలుచుకున్నది. మహారాష్ట్రలో 270 సీట్లకు కాంగ్రెసు 202 గెలుచుకుంది. ఇక్కడ 17 సీట్లు గెలిచిన పెజంట్స్ వర్కర్స్ పార్టీ ప్రధాన ప్రతిపక్షం కాగలదు.

మధ్యప్రదేశ్‌లో 296 స్థానాలలో 167 కాంగ్రెసుకు, ప్రధాన ప్రతిపక్షమైన జనసంఘానికి 77 స్థానాలు వచ్చాయి. మైసూరులో 216 స్థానాలలో 126 కాంగ్రెసుకు రాగా ప్రధాన ప్రతిపక్షంగా 20 సీట్లు గెలిచిన పి. ఎస్. పి. కానున్నది, స్వతంత్ర పార్టీ కూడా 16 సీట్లు గెలుచుకుని బలపడింది.

పైన పేర్కొన్న ఏడు రాష్ట్రాలలోను కాంగ్రెసు ప్రభుత్వాలు కాయమే. కాని, వచ్చే ఎన్నికలనాటికి ఈ పరిస్థితి నిలబడుతుందా అని సందేహానికి తావిచ్చే విధంగా ఆ రాష్ట్రాలలో కొన్నికొన్ని ప్రతిపక్షాలు బలపడ్డాయి. యు పి. లో జనసంఘం, ఎస్. ఎస్. పి, మధ్యప్రదేశ్‌లో జనసంఘం, గుజరాత్‌లో స్వతంత్ర పార్టీ గణనీయమైన సంఖ్యాబలం సంపాదించుకున్నాయి.

వాటి బలం వచ్చే ఎన్నికల నాటికి మరింత బలపడకుండా కాంగ్రెసు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో, సమర్థతతో పని చేయవలసి వుంటుంది.

కొన్ని విశేషాలు

ఇది ఎన్నికల ఫలితాల స్థూల స్వరూపం. కాగా, ఆశ్చర్యకరమైన ఫలితాలు ఇంకెన్నో వున్నాయి. వీటిలో కొన్నిటిని ఇదివరకే మేము పాఠకులకు అందజేశాము. అయినా వాటి ప్రాధాన్యం దృష్ట్యా పాతవాటిని, కొత్త వాటిని కలిపి ముఖ్యమైన విశేషాలను ఈ దిగువ పొందుపరుస్తున్నాము.

కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్‌తో సహా మద్రాసులో కాంగ్రెసు అగ్రనాయకులు. ఒక్క శ్రీ దూపరాహన్ తప్ప రాష్ట్ర మంత్రులందరు, కేంద్ర మంత్రులందరు ఎన్నికలలో ఓడిపోయారు. వీరిలో ముఖ్యమంత్రిశ్రీ భక్తవత్సలం, పరిశ్రమల శాఖమంత్రి శ్రీ ఆర్. వెంకట్రామన్, కేంద్రంలో ఆహార మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం, ఓ. వి. అలగేశన్, సి. ఆర్. పట్టాభిరామన్, శ్రీమతులు సౌందరం రామచంద్రన్, మరకతం చంద్రశేఖర్‌లు వున్నారు. డి. ఎం, కె. పార్టీ లోకసభకు 25 మందిని నిలబెట్టి అన్ని స్థానాలను గెలుచుకున్నది. కాంగ్రెసు మొత్తం 39 సీట్లకు అభ్యర్థులను నిలబెట్టి మూడు మాత్రమే గెలిచింది.

ఒరిస్సాలో మాజీ ముఖ్యమంత్రి శ్రీ బిజూపట్నాయక్, హోంమంత్రి శ్రీ నీలమణి రౌతాయ్ ఓడిపోయారు. యూనియన్ మంత్రులలో శ్రీ విభు దేంద్ర మిశ్రా ఓడిపోయి, మాజీ ముఖ్యమంత్రి శ్రీ పి. సి. ఘోష్, మాజీ కేంద్రమంత్రి శ్రీ హుమయూన్ కబీర్ గెలిచారు. కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ కెసీన్‌చౌధురి ఓడిపోయారు. ముఖ్యమంత్రిని ఓడించినది మాజీ పి. సి. సి. అధ్యక్షుడు శ్రీ అజయ్ ముఖర్జీ కావడం ఒక విశేషం.

బీహారులో ముఖ్యమంత్రి శ్రీ కె. బి. సహాయ్ ఓడిపోయారు. యు. పి. లో పి. సి. సి. అధ్యక్షుడు శ్రీ కమలాపతి త్రిపాఠి ఓడిపోయి, మాజీ ముఖ్యమంత్రి శ్రీ సి.బి. గుప్త గెలిచారు. ముఖ్యమంత్రిణి శ్రీమతి సుచేత కృపలాని లోకసభకు ఎన్నికైనారు.

పంజాబులో ముఖ్యమంత్రి శ్రీ గురుముఖ్‌సింగ్ ముసాఫిర్ ఓడిపోయారు. రక్షణ మంత్రి శ్రీ స్వర్ణ సింగ్ లోకసభకు తిరిగి ఎన్నికైనారు. గుజరాత్ నుంచి శ్రీ మురార్జీదేశాయి. శ్రీ గుల్జారీలాల్ నందా ఎన్నికైనారు. ఆంధ్రప్రదేశ్‌నుంచి కేంద్రం క్యాబినెట్‌లో గల ఇద్దరు మంత్రులలో శ్రీ దామోదరం సంజీవయ్య ఓడిపోయి, శ్రీ నీలం సంజీవరెడ్డి గెలిచారు. ఇతర కేంద్ర మంత్రులలో శ్రీ కె.ఎల్.రావు పోటీ లేకుండా విజయం సాధించగా, శ్రీ బి. ఎస్. మూర్తి, శ్రీ కొత్త రఘురామయ్యకూడా మంచి విజయం పొందారు.

ఆంధ్రలో ఓడిపోయిన రాష్ట్రమంత్రులు

ముగ్గురు, చారు శ్రీమతి టి. ఎన్. సదాలక్ష్మి, శ్రీ బలరామరెడ్డి, శ్రీ మీర్ అహ్మద్ అలీఖాన్. మిగతా మంత్రులందరు గెలిచారు. శ్రీ తోట రామస్వామి కౌన్సిల్ సభ్యుడు కనుక పోటీ చేయలేదు

ఇక ప్రధానమైనవి తీసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఆచార్య రంగా ఓడిపోయాడు. స్వతంత్ర పార్టీ నాయకుడు శ్రీ గొతు లచ్చన్న అసెంబ్లీకి, లోకసభకు కూడా ఎన్నికయ్యాడు. శ్రీ తన్నేటి విశ్వనాథంకూడా అంతే.

కేరళలో శ్రీ ఎ. కె. గోపాలన్, ఆయన సతీమణి కూడా లోకసభకు ఎన్నికయ్యారు.

మహారాష్ట్రలో మితవాద కమ్యూనిస్టు నాయకుడు శ్రీ ఎస్. ఎ. డాంగే, ట్రేడ్ యూనియన్ నాయకుడు ఫెర్నాండెజ్ గెలిచారు. ఇండిపెండెంటుగా పోటీ చేసిన శ్రీ వి. కె. కృష్ణమేనన్ ఓడిపోయారు.

గుజరాత్‌లో మహాగుజరాత్ జనతా పరిషత్ నాయకుడు శ్రీ ఇందులాల్ యాజ్ఞిక్ గెలిచారు.

మధ్యప్రదేశ్‌లో ఇండిపెండెంట్ అభ్యర్థి ఆచార్య కృపలాని, పి ఎస్. పి. నాయకుడు శ్రీ హెచ్. వి. కామత్ లోకసభకు పోటీ చేసి ఓడిపోయారు.

లోకసభలో ప్రతిపక్ష నాయకులుగా పేర్కొనదగిన వారిలో డాక్టర్ రామమనోహర లోహియా, శ్రీపదులిమాయే, శ్రీ హేం దారువా, శ్రీ నాథ్‌పాయ్, శ్రీ ఎస్. ఎం. బెనర్జీ, శ్రీ హీరెన్ ముఖర్జీ గెలిచారు.

అయితే ఎస్.ఎస్.పి.కి చెందిన శ్రీ మణిరామ్ బాగ్రి, జనసంఘ సభ్యుడు స్వామీ రామేశ్వరానంద్, కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ హోమీదాజీ, నాగిరెడ్డి లంబోళ్ళ సమితి నాయకుడు శ్రీ ఎం. ఎస్. అనే ఓడిపోయారు.

స్వతంత్ర పార్టీ కార్యదర్శి శ్రీ ఎం. ఆర్. మసానీ రాజకోట నుంచి విజయం పొందారు. మహారాణి గాయత్రిదేవి రాజస్థాన్ అసెంబ్లీకి వోడిపోయి, జైపూర్ నుంచి లోకసభకు 94 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. జనసంఘం తరపున పోటీ చేసిన శ్రీ బాబూరావ్ పటేల్ ("మదర్ ఇండియా" సంపాదకుడు) మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్ నుంచి లోకసభకు ఎన్నికైనారు.

ఎస్. ఎస్. పి. చైర్మన్ శ్రీ ఎస్. ఎం. జోషి పూనా నుంచి, పాకిస్తాన్‌లో మాజీ హైకమిషనర్ శ్రీ సి. సి. దేశాయి (స్వతంత్ర) గుజరాత్‌లో శబర్‌కాంత నియోజకవర్గం నుంచి లోకసభకు ఎన్నికయ్యారు.

పెద్ద మెజారిటీలు

హోం మంత్రి శ్రీ వై. బి. చవాన్ సతారా నుంచి లోకసభకు 2,07,895 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇంత పెద్ద మెజారిటీతో దేశంలో ఎవ్వరూ గెలవలేకపోయారు. ఆ తర్వాత పెద్ద మెజారిటీ సంపాదించిన వారు బికనీర్ మహారాజా కర్ణిసింగ్ [1,92,816], గ్వాలియర్ రాజమాత విజయరాజే [1,87,189].

ప్రధాని ఇందిరా గాంధికి 91 వేల పైచిలుకు మెజారిటీ లభించింది. అమేయు. పీ. లోని రాయ్ బరేలీనుంచి లోకసభకు ఎన్నికయినారు.

అయితే ఒకే ఓటు మెజారిటీతో గెలిచిన అభ్యర్థి ఒకడున్నాడు. అతడు యు. పి. శాసన సభకు పోటీచేసిన కాంగ్రెసువాది శ్రీ కృష్ణానంద రాయ్.

ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ కొంగర జగ్గయ్య, లోకసభకు మద్రాసులో శ్రీ ఎం. జి. రామచంద్రన్ అసెంబ్లీకి ఎన్నికైన ప్రముఖ సినిమా నటులు.

కేంద్ర మంత్రులలో పరాజయం పొందిన ముఖ్యవ్యక్తి రైల్వే మంత్రి శ్రీ ఎస్. కె. పాటిల్. మద్రాసుకు చెందిన మంత్రులుకాక ఇంకా ఓడిపోయిన కేంద్ర మంత్రులలో శ్రీయుతులు మనూభాయ్ షా, మెహర్‌చంద్ ఖన్నా, ఎ. ఎం. థామస్, రాజ్‌బహదూర్, త్యాగీ, షానవాజ్ ఖాన్, టి. ఎన్. సింగ్ వున్నారు.

యు. పి. లోని ఫూల్‌పూర్ నియోజకవర్గంనుంచి శ్రీమతి విజయలక్ష్మి పండిట్ గెలిచారు. తిరిగి ఎన్నికైనకార్మిక శాఖ మంత్రి శ్రీ జగ్జీవన్‌రాం మొదటినుంచిలోకసభలో తన స్థానంనిలబెట్టుకుంటూ వస్తున్న కొద్దిమందిలో ఒకరు. తిరిగి ఎన్నికైన కేంద్రమంత్రులలో ఆరోగ్యమంత్రి డాక్టర్ సుశీలా నయ్యర్, ప్లానింగ్ మంత్రి శ్రీ అశోక మెహతా, విద్యామంత్రి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, రైల్వే శాఖలో మంత్రి, డాక్టర్ రామ్ సుభాగ్‌సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ సత్యనారాయణసిన్హా, ఆర్థిక శాఖలో మంత్రి శ్రీ టి. ఆర్. భగత్, పెట్రోలియం శాఖలో మంత్రి శ్రీ ఇక్బాల్ సింగ్, కమ్యూనికేషన్స్ శాఖలో మంత్రి శ్రీ ఆర్. జగన్నాథరావు, విద్యాశాఖలో మంత్రి శ్రీ భక్తదర్శన్ వున్నారు.

స్వర్గీయ రాజేంద్రప్రసాద్ కుమారుడు శ్రీ మృత్యుంజయ ప్రసాద్, స్వర్గీయ లాల్ బహదూర్‌శాస్త్రి కుమారుడు శ్రీ హరికిషన్ లోకసభకు ఎన్నికైనవారిలో వున్నారు.

ఓడిపోయిన మాజీ కేంద్రమంత్రులలో ముఖ్యులు శ్రీ అతుల్ ప్రసాద్ జైన్, శ్రీ మహావీర్ త్యాగి, శ్రీ కె.డి. మాలవీయ.

ప్రాచ్యధాషల అభివృద్ధి కమిటీ

పూనా, ఫిబ్రవరి 26— ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ప్రాచ్యధాషల అభివృద్ధి కమిటీ మూడు రోజుల సమావేశాలు ఇదియం ఇక్కడికి వచ్చింది. మాజీ కేరళ గవర్నర్ డాక్టర్ శ్రీ రామకృష్ణారావు ఈ కమిటీ నాయకులు.

పాడి పంటలు

రైతుల ప్రశ్నలకు ప్రత్యుత్తరాలు

నిర్వహణ: డాక్టరు గూడూరి వెంకటచలం

కర్ణాటి లక్ష్మీనరసయ్య, పర్కాలకొండవరం, నర్సాపురం లూకా,

ప్రశ్న: నేను 11 క్రావెకు "తైచుంగ్ నేటివ్-I" వరిపైరు నాటుపెట్టాను. నాకు కొన్ని సందేహాలున్నవి. దయచేసి జవాబు ఆంధ్రజ్యోతిలో నైనా లేక వ్యక్తిగతంగా నైనా ఇవ్వగలరని ప్రార్థన.

పొలంలో ఎకరాకు 6 టన్నులు చొప్పున పశువులపెంట వేశాను. కొద్దిగా పొగాకు పిల్ల (నాటుపొగాకు తలకొమ్మపుడిలో అంతకూ తొక్కించాను. వేరుశనగ చిట్టు (ఆయిల్ కేక్ కాదు) అనగా వేరుశనగ పొట్టు కాక సన్నగా దువ్వలాంటిది మిల్లులలో దొరుకుతుంది. ఈ చిట్టు ఎకరాకు 30 బస్తాలు చొప్పున వేశాను. నీరుకట్టి నాలుగుతూర్లు ట్రాక్టర్‌తో దమ్ము చేశాను. పొలం మొత్తం నెలరోజులు మురగనిచ్చాను. అంటే 4-5 రోజుల కొకమారు పొలం నాలుగుసార్లు దమ్ము చేశాను. నారుమడిలో గ్లైయిసీడియా ఆకు, పెంటమట్టి ఆరుబన్నులువేసి నాలుగుసార్లు ట్రాక్టర్‌తో దమ్ము చేశాను. వట్టు తైచుంగ్‌నేటివ్-1 72 కిలోల మందు పట్టించి నీళ్ళలో 12 గంటలుంచాను. అట్టి వట్టుతీసి మా తెలంగాణాలో మందెపోస్తారు. మందె అనగా భూమిమీద ఆకులు పరచి చుట్టు వరిగడ్డి పేని ఆకులచుట్టూపెట్టి మధ్యలో వట్టు ఎత్తనం పురిపోసి పైన వరిగడ్డి కప్పి రోజు ఉదయం. సాయంత్రం నీరు పోస్తారు. అయిదు రోజులకు మొలక వచ్చాక అట్టి మొలక ధాన్యాన్ని మడిలో వల్లించాను. కాని చలికి నారు సరిగారాలేదు. రెండుమార్లు నారు పోసిన తమపరి 15 రోజులకు 25 రోజులకు అమ్మోనియా, యూరియా తగు మోతాదులో చల్లాను. 18 రోజులకు ఎండ్రిన్ స్ప్రే చేయించాను.

నారు మాత్రం డిసెంబరు 10 అనగా మందెతో సహా పోసిన రోజునుంచి నాటుపెట్టు వరకు జనవరి 14, 15, 16 తేదీలలో నాటుఅయింది. 10 రోజులు నారు ఎక్కువవని నాటు జరిగింది. దీన్ని గురించే భయంగా వున్నది.

పొలంలో ఎకరాకు అమ్మోనియంసల్ఫేట్ 50 కె. జి, అమోనియం సల్ఫేట్ 50 కె.జి. చొప్పున నాటు ముందురోజు పొలంలో వేయించి నాటు ఫెట్టాను, నాటు దేశవాళి పద్ధతిలో చతురపు మీటరుకు 40 మొక్కం చొప్పున నాటాము. అయితే, 6"×6" నాటాము. కాని నారు మాత్రం రెండేసి మొక్కలు చొప్పున చదరపు మీటరుకు 80 మొక్కలు వేశాము. తదుపరి నేను చేయాలనుకుంటున్న పనులు నాటిన పది రోజులకు ఎండ్రిన్ స్ప్రే చేయడం పది రోజులకు అమోనియా సల్ఫేట్ ఎకరాకు 50 కిలోల చొప్పున వేద్దామని వున్నది. తర్వాత దోసులోకాని యూరియా ఎకరాకు 50కిలోల చొప్పున రెండు మూడు అనగా మళ్ళీ 0 కిలోల చొప్పున ఎకరాకు వేద్దామని వున్నది కాని పొలంలో మొక్కలు చూచి కాని ఎక్కువ తక్కువ మోతాదులలో వేయగలను.

నారు మాత్రం బద్దకట్టి రెండు పిలకలు, మూడు పిలకలు వేసినా, అది కొంత మాత్రమే. మొత్తం వేయలేదు. మా గ్రామంలో మరి కొందరు కూడా ఈ వైరు నాటారుకాని ఎవరు లెక్కప్రకారంగా ఏమి చేయలేదు. నన్ను ముందు ఏమి చేయమంటారో దయచేసి వెంటనే జవాబు వ్రాయగలరు.

ప్రత్యుత్తరం: మీ ఉత్తరం పాఠకులకు ఉపయోగకారిగా వుంటుందని ప్రకటిస్తున్నాను. క్షమింప గోరుతాను. మీకు తెలియజేసినవే ఈ పత్రికలో తెలియజేస్తున్నాను.

మీరు పైన చెప్పిన ఎరువులన్నీ వేసిన పిమ్మట 40 పౌ. నత్రజని కంటె ఎక్కువ అక్కరలేదని నా ఉద్దేశ్యం. అందుచేత రెండవసారి అమోనియం సల్ఫేటు నాటిన 15 రోజులకు 50 కిలోలు వేసి యూరియా వేయవద్దని నాకోరిక. నారుమడిలో పిలకలు చేయడం మీరు నారుమడిని వేసిన విధానమును బట్టి వుంటుంది. తక్కువ విత్తనం పోసిన యెడల నారుమడిలో ఎక్కువ పిలకలు వస్తాయి. నారుమడి బలం చేయడం బట్టి కూడా పిలకలు వేయడం వుంటుంది. మీరు వేసినవన్నీ క్రమప్

మన ప్లానింగ్ — దాని సాఫల్య వైఫల్యాల సమీక్ష

మన ప్లానింగ్ బెటిసికొట్టిందా? అందు వల్లనే రూపాయి మారకం విలువను తగ్గించవలసివచ్చిందా? అందువల్లనే ధరలు మండిపోతున్నవా? అందువల్లనే ప్రజలకు గడ్డు రోజైనా చాలామందికి కష్టమైపోతున్నవా?

వాదంకోసం ఈ అన్ని విషయాలు అక్షరాలా నిజమని అంగీకరిద్దాము అయినా, ప్లానింగ్ కొనసాగవలసిందే! ఇప్పటి పద్ధతిలో కాకపోతే, మరొకదాని ప్రకారం అది కొనసాగాలి: ఇప్పటి ప్రభుత్వ నాయకత్వాన కాకపోతే మరొకదాని యాజమాన్యాన అది కొనసాగాలి అంతే తప్ప, అసలు ప్లానింగ్‌కే స్వస్తిచెప్పడం తగదు.

పైకికనబడని ఒకపక్షవాతం వుంటుంది. అది మానసిక పక్షవాతం, ఆ వ్యాధి వచ్చిన వారు సమకాలిక ప్రభావాలకు స్పందించరు. ఇటీవలే ఇది ప్లానింగ్, యుగమని గుర్తించలేకుండా వున్నారు. అదిలో ప్లానింగ్ ఒక్క సోవియెట్ యూనియన్‌కు మాత్రమే పరిమితమై వుండవచ్చు. కమ్యూనిజంలో ప్లానింగ్‌కు రక్తసంబంధం వున్నట్టుగా భావించి, అప్పటిలో దాన్ని పాశ్చాత్యరాజ్యాలు నిరసించి వుండవచ్చు. కాని, ఈ నాడు తరతమ భేదాలతో ప్లానింగ్‌లేని దేశం మచ్చుకైనా లేదు.

క్రమబద్ధంగా జాతీయాత్మక వ్యవస్థను పటిష్ఠం చేయడానికే, సర్వతోముఖ వికాసాన్ని సాధించడానికే. నవజీవన విధానాన్ని నెలకొల్పడానికే సోవియెట్ ప్రభుత్వం ప్లానింగ్‌కు ఓం ప్రథమంగా ఉద్యమించి వుండవచ్చు. ప్లానింగ్‌ను ప్రవేశపెట్టిన ఇతర దేశాల ప్రభుత్వాలను ఈ విధమైన జాతీయ లక్ష్యాలే ప్రేరేపించి వుండవచ్చు. కాని, ప్లానింగ్ ఈనాడు జాతీయపు సరిహద్దులలో నిలిచిపోవడంలేదు; ఆ సరిహద్దుల పైగా కూడా అది కొనసాగుతున్నది. ఈ దశాబ్దిని "అంతర్జాతీయాభివృద్ధి దశాబ్ది" గా భావించి, అందుకు తగు కృషి చేయవలసిందిగా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం ఈ సందర్భంలో గమనార్హం.

మనది రెండుప్రపంచ యుద్ధాల యుగమే కాదు; అణ్వస్త్రాలయుగమే కాదు; సామరస్య పూర్వకంగా జీవించలేకపోతే సమస్త వినాశం తప్పదన్న సంగతి గుర్తించబడిన యుగం కూడా. ఇంతేకాదు. ప్రపంచంలో కొన్ని ప్రాంతాలలో దారిద్ర్య దైన్యాలు తాండవిస్తుండగా తక్కినప్రపంచం శాంతిసుఖాలతో విలసిల్లలేకపోవడం ఈ యుగంలో పూర్తిగా గుర్తించబడింది. సుప్రసిద్ధ చరిత్రకారుడు ఆర్నోల్డ్‌టాయన్‌బీ చెప్పినట్టు, మొత్తం మన వాళిసంక్షేమాన్ని, సౌభాగ్యాన్ని సాధించడం మహాప్రస్థానమని ప్రపంచచరిత్రలోనే ప్రప్రథమంగా గుర్తించబడింది ఈ యుగంలోనే. "సర్వే జనా సుఖినోభవంతు" అన్నది కేవలం ఒక ప్రార్థనగా మరి మిగలనక్కరలేదు. గత శతాబ్దిలోలాగ, మరింత ముఖ్యంగా, గత అర్థశతాబ్దిలోలాగ వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్ర రంగాలలోని విప్లవాత్మక పరిణామాల పిమ్మట కల్పవృక్షాలు, కామధేనువులు స్వర్గలోకంలో మిగలనక్కరలేదు; లేదా సత్యయుగాలలోనే అవి మిగలనక్కరలేదు ఇటు మనం చేయవలసింది ఒక్కటే. అది - జాతీయంగా, అంతర్జాతీయంగా మరింత విస్తృతంగా, మరింత విజ్ఞతాపూర్వకంగా, మరింత సమర్థంగా, మరింతగా పరస్పర సహకారంతో ప్లానింగ్.

★

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మన దేశంలో ప్లానింగ్‌ను ప్రవేశపెట్టిందికొందరు ఆరోపిస్తున్నట్టు అయన ప్రచ్ఛన్నపు కమ్యూనిస్టు అయినందువల్ల కాదు; ప్లానింగ్ ఈయుగధర్మమైనందునే! నెహ్రూకాక, మరొకడు స్వతంత్ర భారతానికి మొదటి ప్రధానిగా ఎన్నికై వున్నా, అయన నాయకం ప్లానింగ్‌కు విధిగా ఉద్యమించవలసి వచ్చేదే!

కాగా, ప్లానింగ్ విరోధులు పేర్కొంటున్నట్టు, మనపంచవర్షప్రణాళికలుపూర్తిగా విఫలమైపోలేదు, మరికొంత ముందుకు వెళ్ళి ఈ ప్రణాళికలు అమలుజరిగి వుండకపోతే ఈనాటి మన చిక్కులు, మన చికాకులు బహుశా పడింతలు అయివుండేవని చెప్పవచ్చునేమో కూడా!

మొదటి పంచవర్ష ప్రణాళికను ప్రారంభించినప్పుడు మన జనాభా దాదాపు 37 కోట్లు; ఈ నాడు అది 50కోట్లకు పెరిగింది. ప్రస్తుతం సంవత్సరానికి ఒక కోటిచొప్పున అది పెరుగుతూ పోతున్నది. దీని తాత్పర్యం ఏమంటే మరొక దేశం వచ్చి మనపై పడుతున్నట్లు! ఆస్ట్రేలియా ఒక పెద్ద ఖండం. అయినా, దాని జనాభా ఇంచు మించుగా ఒకకోటి మాత్రమే. న్యూజిలాండ్ ఒక పెద్ద దేశం. అయినా దాని జనాభా 21 లక్షలు మాత్రం. ఇంతకు మించిన జనాభాగల నగరాలు మనకు అయిదారు చొరకు వున్నాయి. ప్రస్తుతంలో చెనడా మన దేశం కంటె మూడు రెట్లకు పైగా పెద్దది. కాని, దాని మొత్తం జనాభా రెండు కోట్లలోపు; ఫ్రాన్సు, ఇటలీల జనాభా మన హిందీ రాష్ట్రాల జనాభాలో సగం. స్పెయిన్, హాలెండ్‌ల జనాభా మన ఆంధ్ర ప్రదేశ్ జనాభా కంటె ఏమంత పెద్దవి కావు. ఈ విధంగా ఇతర విషయాలలోకి వెళ్ళకుండా, ఒక మాట చెబితే సరిపోతుంది. జనాభాలో మన సాలీనా పెరుగుదల (ఒక కోటి) కంటె తక్కువ జన సంఖ్య వున్న దేశాలు కనీసం ఒక యాభై, అరవై చొరకు వున్నాయి!

నాలుకు ఒక దేశం చొప్పున ఈ విధంగా వచ్చి చేరుతున్న ఈ పరిస్థితిలో ప్లానింగ్ లేకపోతే, ఈ నాడు మన స్థితి విజంగానే మరింత క్లిష్టంగా వుండేదో!

★

మన జనాభా అధికంగా వుందని మన ప్లానింగ్ కమిషన్ వారికి తెలియదా? అందుకు తగినట్టుగా తమ ప్రణాళికలను హరెండుకు సిద్ధం చేయలేదు ?-ఈ ప్రశ్నలను కొందరు వేయవచ్చు. వారు వీటిని వేస్తున్నారు కూడా.

జనాభా పెరుగుదలను మన ప్లానింగ్ కమిషన్‌వారు పరిగణనలోకి తీసుకొనకపోలేదు. కాని ప్రథమ పంచవర్ష ప్రణాళికను రూపొందించిన ఘట్టంలో వారు చేసిన పొరపాటు సాలుకు నూటికి 1.25 వంతుల చొప్పున మాత్రమే పెరగనున్నట్టు అంచనా వేసుకొనడం. ఈ అంచనాపైనే 1978 నాటికి తలసరి సాలీనా ఆదాయాన్ని రెట్టింపుకు పెంచవచ్చునని వారు భావించారు. కాని జనాభా సాలుకు నూటికి 1.25 వంతుల చొప్పున కాక 2.5 వంతులు పెరుగుతూ పోయేసరికి వారి అంచనాలన్నీ తలక్రిందులైపోయాయి.

అయినా, దాదాపు అన్ని రంగాలలో కూడా ప్లానింగ్ ప్రత్యక్షఫలితంగా దేశం పురోభివృద్ధిని సాధించింది. ఈ పురోభివృద్ధి మన ప్రణాళికలు పెట్టుకున్న లక్ష్యాలను అందుకొనివుండకపోవచ్చు. అంతమాత్రం చేత అసలే పురోభివృద్ధి లేదనడం ప్లానింగ్ స్వాతానికే విరోధులైనవారు చేయదగు విమర్శ మాత్రమే!

ప్లానింగ్‌ను నిందించేవారు ముఖ్యంగా వేలెత్తి చూపేది మన వ్యవసాయరంగాన్ని. ఈనాడు ఆహార పరిస్థితి ఎంతో క్లిష్టంగా వున్న మాట నిజమే. ఈ రంగంలో సయితం ఆశించినంతగా, అవసరాలకు తగినంతగా మనం పురోగతిని సాధించలేకపోయినా, మొత్తంపై ముందడుగు వేయడమే జరిగింది. నిరటి అనావృష్టిని, దాని వల్ల నష్టపడిన పంటను విడిచిపెట్టి, 1965వ సంవత్సరాన్ని తీసుకుని, దాన్ని 1950 నాటి పరిస్థితితో పోల్చితే ఆహారోత్పత్తిలో అభివృద్ధి ఏమంత స్వల్పంకాదని స్పష్టపడుతుంది.

1950లో కంటె 1965లో మన జనాభా ఇంచుమించుగా 1½ కోట్లు అధికం. అయినా, 1950లో తలసరి సాలీనా ఆహార ధాన్యాల వినియోగం 315 పౌనులు కాగా, 1965లో 315 పౌనులు! ఇదే విధంగా పంచదారకు సంబంధించినంతవరకు ఈ అంకెలు 1950వ సంవత్సరానికి ఏడుపౌనులు, 1965వ సంవత్సరానికి పన్నెండు పౌనులు.

★

మన ప్లానింగ్‌లో లోపాలు లేవని చివరికి ప్లానింగ్ కమిషన్‌వారైనా చెప్పడం లేదు. ఆ మాటకు వస్తే, ఏ దేశం ప్లానింగులోనైనా ఏవో కొన్ని లోపాలు వుండకతప్పదు. ఎంత జాగ్రత్తగా చేసిన అంచనాలైనా కొన్నికొన్ని సందర్భాలలో తప్పిపోవడం కద్దు. పైగా ప్రణాళికల నిర్వహణ సందర్భంలో అనుకొనని చిక్కులు కొన్ని తలెత్తవచ్చు, ఉదాహరణకు, ఈ శతాబ్దిలోనే అతి తీవ్రమైన అనావృష్టి బాధను అనేక రాష్ట్రాలలో ఒకేసారి ఎదుర్కొనవలసి వస్తుందని ముందుగానే తెలుసుకొనడం ఎవరికి సాధ్య? ఎలా సాధ్యం? చైనాతో, పాకిస్తాన్‌తో యుద్ధాలు సంభవించగల ప్రమాదం వున్నట్టు ఊహించడానికి వీలున్నా, దాన్ని అంచనాలోకి తీసుకొనకపోవడంలో మాత్రం మన ప్లానింగ్ కమిషన్‌వారు పొరపాటు చేశారు.

మొదటి రెండు పంచవర్ష ప్రణాళికల పేరైనా మన మూడవ ప్రణాళిక అరిచిన ఫలితాల నివ్వలేకపోవడానికి మూడు ప్రధాన కారణాలను పేర్కొనవచ్చు.

(1) ఈతిబాధలవల్ల వ్యవసాయ రంగం దెబ్బతినడం.

(2) చైనా, పాకిస్తాన్‌లతో యుద్ధం సంభవమన్న విషయాన్ని అందనాలోకి తీసుకొనకపోవడం.

(3) జనాభా పెరుగుదలను అరికట్టడానికి తగినంత ముందుగానే దృఢంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని కొనసాగించకపోవడం.

వీటివల్లనే మన మూడవ ప్రణాళిక చాలా కుంటుపడింది. వీటివల్లనే మన నాల్గవ ప్రణాళికను సమగ్రరూపంలో సిద్ధపరచుకొనడంలో విలంబన సయితం జరిగింది.

ప్రస్తుతం మన చతుర్థ ప్రణాళికను కొనసాగించడంలో అనేక క్లిష్టసమస్యలను మనం ఎదుర్కొనవలసి వున్నమాట నిజమే. అవి మన శక్తియుక్తులకు, మన కార్యదీక్షకు, మన విజిగీషకు ఒక సవాలు కావాలి. అంతే తప్ప, అసలు ప్లానింగ్‌కే స్వస్తిచెప్పడం విజ్ఞత కాదు.

★

మన ప్లానింగ్ విషయమై సాధికారంగా మాట్లాడగల కొద్దిమంది ప్రముఖులలో ఒకరు శ్రీ అశోకమెహతా. కొంతకాలంగా అయన మన ప్లానింగ్ కమిషన్‌కు ఉపాధ్యక్షుడు! ప్రస్తుతం ప్లానింగ్ మంత్రి కూడా. ఈ పదవులకు రాకముందు శ్రీ అశోకమెహతా ప్లానింగ్ విషయమై విశేషంగా శ్రద్ధాసక్తులను ప్రదర్శించిన ప్రశాసనాయకుడు. ఆర్థిక శాస్త్రం ఆయనకు అభిమాన విద్య. దానిలో అయనకుగల పాండిత్యం ప్లానింగ్ విషయమై అయనకున్న సమగ్రపరిజ్ఞానాన్ని సంపాదించడానికి ఆయనకు ఉపకరించింది.

మన ప్లానింగ్‌ను గురించి శ్రీ మెహతా వివిధ సందర్భాలలో చేసిన 32 ప్రసంగాల నుంచి ముఖ్యభాగాలను ఒక సంపుటిగా భారతీయ విద్యాభవన్‌వాడు ప్రచురించారు. మన ప్లానింగ్ లక్ష్యాలను, ఆ లక్ష్యాల సాధనలో మన సాఫల్య వైఫల్యాలను, ప్రస్తుత సమస్యలను, భావికర్తవ్యాన్ని ఈ సంపుటి పూర్తిగా వివరిస్తున్నది.

శ్రీ మెహతా తన ప్రసంగాలలో పెక్కుసార్లు హెచ్చరించినట్టు, ప్లానింగ్ కేవలం ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో పురోగతి సాధనకు మాత్రమేకాదు; మన భౌతిక సంపదల పెంపుదలకు సయితం కాదు. దాని ద్వారా జీవిత దృక్పథమే మారాలి. మన జీవితవ్యవస్థే మారాలి. సంప్రదాయసిద్ధమైన, సత్పథమైన పాతసంఘం స్థానంలో నవశక్తి లసితమైన నూతనసంఘాన్ని మనం నిర్మించుకోవాలి.

మనకు జాతీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించిపెట్టిన రాజకీయ విప్లవాన్ని మించిన మరొక విప్లవం - సాంఘిక విప్లవం- ఇప్పుడు కావాలి. ఇది మన మనస్సులలో ప్రారంభమై, మన ఆలోచనలను మార్చాలి, అలవాట్లను మార్చాలి, ఆశలను మార్చాలి, ఆశయాలను మార్చాలి, అనేక విధాల ఒక కొత్త జాతిగా మనను రూపొందించాలి. అప్పుడే మన ప్లానింగ్ నిజంగా జయప్రదమైనట్టు; అప్పుడే నిజంగా అది సార్థకమైనట్టు!!

శ్రీ అశోకమెహతాకు ప్రజోద్యమాలతో సన్నిహిత సంబంధం వున్నా, పండిత వర్గం మధ్య రాణించినంతగా ప్రజాసమూహాల మధ్య రాణించలేదు. ఈ లోపం ఆయన ప్రసంగాలలో కూడా కానవస్తున్నది. వాటిలో పారిభాషిక పదజాలం విశేషంగా వున్నది. ఇవి పండితులు, లేదా, ప్రసీదుల సభలలో ఆయన హెచ్చుగా చేసిన ప్రసంగాలు కాబట్టి. ఇంతగా పారిభాషిక పదజాల వినియోగం ఒక దోషం కాకపోవచ్చు. కాని, సామాన్య ప్రజల ముందు ప్రసంగించినా, శ్రీ మెహతా మరొక ధోరణిని ఎంతవరకు అవలంబించగలిగేవారో అనుమానమే!

ఏమైనా, మన ప్లానింగ్ స్వరూప స్వభావాలను, దాని సాఫల్య వైఫల్యాలను, ఇంతకంటె ముఖ్యంగా, దాని తాత్విక ప్రాతిపదికలను తెలుసుకొనగోరేవారు శ్రద్ధాసక్తులతో పఠించవలసిన గ్రంథమిది.

★

శ్రీ అశోకమెహతావలె మన ప్లానింగ్‌తో ప్రత్యక్ష సంబంధం లేనివారైనా ప్రొఫెసర్ సి. టి. కురియెన్ అర్థశాస్త్రంలో నిష్ణాత. మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో అర్థశాస్త్రాచార్యుడుగా అయన దైనందిన కర్తవ్యం క్లిష్టవిషయాలను విద్యార్థులకు సరళశైలిలో, సుబోధకంగా వివరించడం. ఈ విషయంతో తమ కున్న విశేషానుభవాన్ని వినియోగించి, పారిభాషిక పదాలను వీలైనంత వరకు విస్తరిస్తూ, సామాన్య పాఠకుడు సయితం సులభంగా అర్థంచేసుకోగల విధంగా మన పంచవర్ష ప్రణాళికలను గురించి అయన సమగ్రమైన గ్రంథాన్ని వ్రాశారు.

మన పంచవర్ష ప్రణాళికలలో మొదటి మూడింటిని ఈ గ్రంథం వివిధ దృక్కోణాల నుంచి పరిశీలిస్తున్నది. వివిధ సమయాలలో శ్రీ అశోకమెహతా చేసిన ప్రసంగాల సంకలనమైనందున అయన గ్రంథంలో లేని సమగ్రత దీనిలో వున్నది. మన పంచవర్ష ప్రణాళికలపై వెలువడిన పెక్కు గ్రంథాలను ఈ సమీక్షకుడు పరిశీలించాడు. వాటిలో ఇంత సమగ్రమైంది, ఇంత సుబోధకమైంది మరొకటి నిశ్చయంగా లేదు.

ప్రొఫెసర్ కురియన్ తన గ్రంథంచివర హెచ్చరిస్తున్నట్టు, మన ప్రణాళిక విషయమై మన కేంద్ర ప్రభుత్వం, మన ప్లానింగ్ కమిషన్ ఏమి నిర్ణయాలు చేసినా, వాటి సాఫల్యవైఫల్యాలపై అంతిమ నిర్ణయం పూర్తిగా ప్రజల చేతిలోనే వున్నది. ప్రణాళికల ద్వారా మన దేశ పురోగతి ప్రజలు వాటిని సరిగా అర్థం చేసుకొనడంపైనే, సరిగా అమలు పరచడంపైనే చివరికి ఆధారపడి వుంటుంది. వారే నవజీవన నిర్మాతలు. వారే జాతీయ భవిష్యత్ నిర్దేశకులు. అందుకే వారిని మనస్సులో పెట్టుకుని, వారి కోసం ప్రొఫెసర్ కురియెన్ ఈ పుస్తకం వ్రాశారు.

అట్టి ప్రజలకు ఈ పుస్తకం పూర్తిగా వినియోగపడాలంటే, దీన్ని ముఖ్యమైన మన దేశభాషలన్నింటిలోకి తర్జుమా చేయాలి. రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్లానింగ్ శాఖలవారు మన ప్రణాళికల విషయమై ప్రచారం చేయకపోవడంలేదు. కాని, అధికారులు చేసే రచనలను అధికార ముద్రలో ప్రచురించినప్పుడు దాన్ని కేవలం ప్రభుత్వ ప్రచారంగా ప్రజలు తోసివుచ్చే ప్రమాదం వున్నది. ఇది అనధికార రచన కాబట్టి దీనికి ఆ విధమైన ప్రమాదం లేదు. పైగా, అధికార రచనలు చెక్కిందికంటె ఇది ఎంతో సమగ్రం, ఎంతో సుబోధకం.

★

"రాజకీయ విప్లవం ముఖ్యమైందే. అంతకంటె కూడా ముఖ్యమైంది ఆర్థిక విప్లవం. కాని, ఈ రెండింటికంటె అతి ముఖ్యమైనట్టిది ప్రజలలో సాధించవలసిన సాంఘిక విప్లవం." అని ఒక సందర్భంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హెచ్చరించడం జరిగింది. ఈ సాంఘికవిప్లవాన్ని సాధించకపోతే మన ప్లానింగ్ విఫలమైనట్టే! ఇంతేకాదు. ప్లానింగ్ సాఫల్యానికి కావలసిన వాతావరణం సాంఘిక విప్లవంద్వారా లేకపోవడం వల్ల నెలకొనదు.

రాజకీయ స్వాతంత్ర్యాన్ని మనం పొందిన తర్వాత, ఇంతకంటె ముఖ్యంగా పంచవర్ష ప్రణాళికలను మనం ప్రారంభించిన తర్వాత ఏయే రంగాలలో, ఏయే మేరలకు మన సాంఘిక జీవితం పరివర్తనం చెందిందో భారత ప్రభుత్వానికి చెందిన పబ్లికేషన్స్ డివిజన్‌వారు ప్రచురించిన ఒక కరపత్రం సంగ్రహంగా సూచిస్తున్నది.

మన సర్వరాజ్యాంగపీఠికలో మొదటి కొని, మన జెయిళ్ళ సంస్కరణలవరకు ప్రతి ఒక్కటి మనసంఘంలో ఎంతో కొంత పరివర్తనాన్ని సాధించిన మాట నిజమే. కాని, వాటిలో ఎన్ని, ఎంతవరకు విప్లవాత్మక పరిణామాలన్న ప్రశ్న లేకపోలేదు.

మన మనస్సులలో పరివర్తనం రానిదే, కొత్త దృష్టితో అన్ని సమస్యలను మనం పరిశీలించడం ప్రారంభంకానిదే-సాంఘిక విప్లవం కొనసాగడం కల్ల. మన జాతీయ జీవితం ప్రస్తుత ధోరణులను పరికించగా, రాజకీయ స్వాతంత్ర్యం రెండు దశాబ్దాల క్రితమే మనకు సిద్ధించినా, ఈ నాటికి కూడా మానసిక స్వాతంత్ర్యం అంతగా ప్రస్తుతం కావడం లేదనే చెప్పాలి. ఈ మానసిక స్వాతంత్ర్యం లేన తరహా మనసంఘంలో ఏయే మార్పులు జరిగినా అవి పైపైమార్పులే కావలవు.

★

మన పంచవర్ష ప్రణాళికలు, ఏమీ సాధించలేదని ఘోషిస్తున్న వారి నోరు కట్టి వేయుచగల పాటిది మొదటి మూడు ప్రణాళికల కాలంలో వివిధ రంగాలలో మన పురోగతిని చిత్రాల రూపంలో వివరిస్తూ పబ్లికేషన్స్ డివిజన్ వారు కొత్తగా వెలువరించిన ప్రచురణ.

మన ప్రణాళికలను గురించి ప్రస్తావిస్తూ కొన్నేళ్ళక్రితం నాటి మన ప్రధాని నెహ్రూ "ఒక నవ ప్రపంచ సరిహద్దులలో నేడు మనం వున్నా" మన్నారు. ఆ నవప్రపంచం రూపురేఖలను ఈ ప్రచురణ కళ్ళకు కట్టినట్టు చూపుతున్నది. దీనిలోని చిత్రాలవలె, వివరణ కూడా పోయిన పదిహేను సంవత్సరాలలో ఆశాభంగాలు, అవాంతరాలు అనేకం తప్పకపోయినా, మొత్తంపై మనం ఎన్నదగు పురోభివృద్ధిని సాధించినట్టు వేనోళ్ళ చాటుతున్నాయి.

ఈ పుస్తకానికి మరికొంత చెలపెట్టవలసి వచ్చినా, దీని ముద్రణపు ఇంతకంటె మంచి కాగితాన్ని వాడివుంటే, చిత్రాల ముద్రణ మరింత చక్కగా వుండి, ఇది మరింతగా శోభించి వుండేది.

★

"ఉట్టికి ఎగలేని అమ్మ స్వర్గానికి ఎగరగలదా? మూడవ ప్రణాళిక లక్ష్యాలనే మనం సాధించుకొనలేకపోయాము. అంతకంటె పెద్దవాటిని సాధించడం మన తరమా? అయినా, నాల్గవ ప్రణాళికలో మరింత పెద్ద లక్ష్యాలను పెట్టుకొనడం తగునా?" - ఈ విధంగా నేడు పెక్కుమంది హెచ్చరిస్తున్నారు. వారు ప్లానింగ్ విషయమై ఒక ముఖ్యవిషయాన్ని విస్మరిస్తున్నారు. మొదటి మూడు ప్రణాళికలలో సాధించిన విజయాలను నిలబెట్టుకోవాలంటే నాల్గవ ప్రణాళిక మొదటి మూడింటికంటె విధిగా పెద్దది కావాలి. పురోగామి శక్తులను ఒకసారి జాగరితం చేసిన తర్వాత వాటిని స్తంభింప చేయడం సాధ్యంకాదు. ఆ పని చేస్తే, అదిలోకంటె పరిస్థితి మరింత అధ్వాన్నమైపోతుంది.

మూడవదానితో పోల్చినప్పుడు నాల్గవ ప్రణాళిక పెద్దదైనా, వాస్తవానికి అది మన ప్రస్తుత జాతీయావసరాలకు తగినంత పెద్దది కానేకాదు. పైగా, ఒక జాతి పెద్దగానే లక్షించాలి. ఆ లక్ష్యసాధనకు శక్తివంచన లేకుండా చిత్తశుద్ధితో కృషిని కొనసాగించిన మీదట, పూర్తి విజయాన్ని సాధించలేకపోయినా, అది లోచనీయ విషయం కాదేదు. అత్యాశ వ్యక్తుల విషయంలో తప్పుకావచ్చుగాని, జాతి విషయంలో కాదు.

ఇదివరకటికంటె మిన్నగా ఇక మీదట మన ప్రణాళికల సాఫల్య వైఫల్యాలు ప్రజా సహకారంపైనే ఆధారపడివుంటాయి. అందువల్ల వీటి మన నాల్గవ ప్రణాళిక స్వరూపస్వభావాలను అవగాహన చేసుకోవాలి. అందుకు పబ్లికేషన్స్ డివిజన్‌వారి కొత్త ప్రచురణ తోడ్పడుతుంది, ఇది చతుర్థ ప్రణాళిక స్వరూపాన్ని సంగ్రహంగా తెలియజేస్తున్నది.

The Plan: Perspective and Problems by Asoka Mehta. Bharatiya Vidya Bhavan, Bombay-7. Rs. 8/.

Our Five-Year Plans by C. T. Kurien. The Christian Institute for the Study of Religion and Society, Bangalore-6. Rs. 5/-

Social Change in India since Independence. 30 Paise.

Fifteen Years of Planning. Rs. 3/-

Fourth Five Year Plan. A Summary of the Draft Outline. 60 Paise.

All the three titles issued by Publications Division, Delhi 6.



బీహార్‌లో కోసీ నదిపై నిర్మించిన రోడ్డు వంతెనకు కేంద్ర మంత్రి శ్రీ సంజీవరెడ్డి ప్రారంభోత్సవం చేసినప్పటి దృశ్యం

లోకసభలో పూర్తి మెజారిటీ

(1 వ పేజీ తరువాయి)

గోండా నుంచి శ్రీమతి సుచేతా కృపలానీ (కాం) లోకసభకు ఎన్నికైనారు.

అఖిలభారత హిందూమహాసభ ఉపాధ్యక్షులు శ్రీ దిగ్విజయనాథ్ గోరఖ్‌పూర్ నియోజక వర్గంనుంచి కాంగ్రెసు అభ్యర్థి శాసిదన్ లాల్ సన్యాసాను ఓడించివిజయాన్ని సాధించారు.

ఈ నియోజకవర్గంనుంచి రోహన్‌లాల్ [కాం] లోకసభకు ఎన్నికయినారు.

ఆంగుల్ నియోజక వర్గంనుంచి శ్రీ దేవేంద్రసింగ్ దేవ్‌లాల్ (స్వ) ఎన్నికయినారు.

మధుబనినుంచి శ్రీ శివచంద్ర ఝా (పి. ఎస్. పి.) ఎన్నికయినారు.

రైసరీగంజ్‌నుంచి లోకసభకు శ్రీమతి శకుంతలా నాయర్ (జన) ఎన్నికయినారు.

సాక్రానుంచి మేవాలాల్ మహతో (ఎస్ ఎస్. పి.) హాజీపూర్‌నుంచి శ్రీబాల్మీకి చౌదురి (కాం) లోకసభకు ఎన్నికయినారు.

మరికొన్ని ఫలితాలు

బొంబాయి, ఫిబ్రవరి 26— మహారాష్ట్రలోని కరర్ లోకసభ నియోజక వరంనుంచి కేంద్ర కార్మిక ఉద్యోగ కల్పనశాఖ ఉపమంత్రి శ్రీ డి. ఆర్. చావన్ ఎన్నికయ్యారు.

గుజరాత్‌లోని ఆనంద్ లోకసభ నియోజక వర్గంనుంచి ప్రస్తుత కాంగ్రెసు ఎం. పి. నరేంద్రసింగ్ మహిదా గుజరాత్ స్వతంత్ర పార్లమెంటరీబోర్డు చైర్మన్ శ్రీ హెచ్. ఎం. పటేల్‌ను ఓడించారు.

మైసూరులోని మంగుళూరు లోకసభ నియోజక వర్గంనుంచి కేంద్ర రవాణా శాఖ స్టేట్‌మంత్రి శ్రీ సి. ఎం. పూనాచా ఎన్నికయ్యారు.

పంజాబ్‌లోని రుపార్ లోకసభ నియోజక వర్గంనుంచి భుటోసింగ్ (కాంగ్రెసు) ఎన్నికయ్యారు.

యు. పి లోని హమీర్‌పూర్ లోకసభ నియోజక వర్గంనుంచి స్వామిబ్రహ్మానంద్ (జన) ఎన్నికయ్యారు.

అండమాన్‌నికోబార్ పార్లమెంటరీనియోజకవర్గం నుంచి కె.ఆర్ గణేశ్ (కాం)ఎన్నికయినారు.

పుర్లియా లోకసభ నియోజకవర్గం నుంచి భజహరీమహతో (లోకసేవక్ సంఘం)ఎన్నికయినారు.

షిమోగా పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి జె. ఏటేల్ (ఎస్.ఎస్.పి) ఎన్నికయినారు.

ఆగ్రా నుంచి లోకసభకు సేఠ్ ఉచల్ [కాం] ఎన్నికయినారు.

పుదుచ్చేరి నుంచి లోకసభకు ఎస్. నేతరామన్ [కాం] ఎన్నికయారు.

కంటోయూ నుంచి లోకసభకు సమర గుహ [పి.ఎస్.పి] ఎన్నికయినారు.

ఫిల్లౌర్ నుంచి లోకసభకు సాధురామ్ [కాం] ఎన్నికయినారు.

తారన్ తారన్ నుంచి గుర్దుదయాల్ సింగ్ ధిల్లాన్ [కాం] ఎన్నికయినారు.

బరోడా నుంచి పాషాభాయి పటేల్ (స్వతంత్ర) మోర్నా నుంచి అత్మారాన్ (ఇండి) మిర్జిక్ నుంచి సంకట ప్రసాద్ (కాం) ఉడిపి నుంచి జె. ఎం. లోబోప్రభు (స్వతంత్ర) నాగపూర్‌నుంచి సందకుమార్ సోమాని (స్వ) దాల్టన్ గంగ్ నుంచి శ్రీమతి కమలకుమారి (కాం) రాజ్‌పూర్ నుంచి శ్రీ నాథ్‌పాయ్ (పి. ఎస్. పి) పాటియాలానుంచి మహంత్ మోహిందర్ కౌర్ ఆరామ్ బాగ్ నుంచి అమియనాథ్ లోస్ (పార్టీ)డెహ్రాడూన్ నుంచి శ్రీ యశ్‌పాల్ సింగ్ (ఇండి) దాహోయ నుంచి శ్రీ మనభాయిషా (కాం) జాలోర్ నుంచి దేవకీనందన్ పాటోడియా (స్వ) అహ్మదాబాద్ నుంచి శ్రీ ఇందూ లాల్ యజ్ఞిక లోకసభకు ఎన్నికయినారు.

ఢిల్లీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26—ఢిల్లీ విశ్వవిద్యాలయ విజిటర్ హోదాలో రాష్ట్రపతి రాధాకృష్ణన్ ప్రస్తుత ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. ఎన్, గంగూలిని ఈ నెల 28 నుంచి వైస్ ఛాన్సలర్‌గా నియమించారు.

డాక్టర్ సి. డి. దేశ్‌ముఖ్ పదవీకాలం పూర్తి అయినందున ఈ పోస్టు ఏర్పడింది.

శ్రీ కామరాజ్‌కు న్యూఢిల్లీ విమానాశ్రయంలో ఇందిర, చావన్ ప్రభృతుల స్వాగతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26—

కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కె. కామరాజ్ నేడు మద్రాసు నుంచి నూఢిల్లీ వచ్చారు. ఆయనకు విమానాశ్రయంలో ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి, హోం మంత్రి శ్రీ వై. బి. చావన్ ప్రభృతులు స్వాగతం చెప్పారు

కాంగ్రెసు అధ్యక్షునికి స్వాగతమిచ్చిన వారిలో ప్రణాళికా మంత్రి శ్రీ అశోక మెహతా, ఆహార, వ్యవసాయ మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం శ్రీ గుల్జారీలాల్ నందా వున్నారు.

శ్రీ కామరాజ్ తన జనకు చేరుకొనగానే అయనను డాక్టర్ పరీక్షించారు.

శ్రీ కామరాజ్ ఇక్కడ సెంట్రల్ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో పాల్గొంటారు.

ఈ సమావేశంలో పెక్కు ఇతర విషయాలతోపాటు నాయకత్వం సమస్యను గురించి కూడా చర్చ పరిశీలిస్తుంది.

పాలం విమానాశ్రయానికి వచ్చిన వారిలో కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ సాదిక్ అలీ, కాశ్మీర్ హోం మంత్రి శ్రీ డి. పి. ధర్ కూడా వున్నారు.

తన అరోగ్యం ఎలావుంటున్నదని శ్రీమతి గాంధి అడుగగా, తాను కులాసాగానే వున్నానని శ్రీ కామరాజ్ బదులు చెప్పారు.

మద్రాసునుంచి ప్రయాణం

మద్రాసు, ఫిబ్రవరి 26 — కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కామరాజ్ నేటి ఉదయం ఇక్కడ నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్ళారు. ఆయనవెంట సొంత వైద్యుడు డాక్టర్ ఎం. జయరామన్ కూడా వున్నారు.

ఫిబ్రవరి మొదటి వారంలో ఎన్నికల పర్యటన సందర్భంలో తిరునల్వేలి సమీపాన జరిగిన కారు ప్రమాదంలో తగిలిన గాయాల నుంచి శ్రీ కామరాజ్ సంతృప్తికరంగా కోలుకొంటున్నారు. అయన నేడు ఢిల్లీ ప్రయాణం చేయడానికి డాక్టర్ ఎం. నటరాజన్ అనుమతించారు. శ్రీ కామరాజ్ చేతి కర్ర సహాయంతో మెల్లిగా విమానంలోకి ఎక్కారు.

శ్రీ కామరాజ్ మార్చి మూడవ తేదీన తిరిగి మద్రాసు వస్తారు.

అదే విమానంలో కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం, కెమికల్ శాఖ సహాయ మంత్రి శ్రీఎ

ప్రాబల్య సాధనయత్నంలో మావో వర్గీయుల వైఫల్యం

రెడ్‌గార్డుల సాంస్కృతిక విప్లవంపట్ల ప్రజా నీకంలో నానాటికి పెరుగుతున్న ప్రతిఘటన

టోక్యో, ఫిబ్రవరి 26—

చైనాలో అధికారాన్ని హస్తగతం చేసుకొనడానికి జరుగుతున్న పోరాటంలో మావో ఆయన వర్గీయులు తమ బలాన్ని సంఘటితం చేసుకొనడానికి చేసిన ప్రయత్నాలు ఇంతవరకు విఫలమైనాయని పీకింగ్‌నుంచి సమాచారం అందినట్టు మాస్కో రేడియో ప్రకటించింది.

పీకింగ్‌నుంచి వెలువడే విప్లవసైన్యం దినపత్రిక వ్రాసిన సంపాదకీయంలో మావో వర్గీయులు సైన్యం నాయకత్వంలో తీసుకున్న తర్య ప్రజలను రెచ్చగొట్టి వారి ప్రతిఘటనను పెంచివేసిందని, సైన్యంలో చీలికలు వచ్చాయని, ఒకవర్గాన్ని మరొకటి ద్వేషించుకుంటున్నాయని మాస్కో రేడియో తెలిపింది. మావో నాయకత్వానికి వ్యతిరేకత హోనాన్ రాష్ట్రంలో కొనసాగుడూ ఉండడమేకాక హూప్, పుకిన్ రాష్ట్రాలు పశ్చిమంలోకల పింకియాంగ్ రాష్ట్రంలో పెరుగుతున్నదని.

రెడ్‌గార్డులకు సలహా

శ్రామిక, సాంస్కృతిక విప్లవం మావో సే టుంగ్ సిద్ధాంతాలపై ప్రబలిన వ్యతిరేకత సర్దుమణగేవరకు చైనా రెడ్‌గార్డులు తమ ఉత్సాహానికి కళ్ళెం వేయాలని సలహా ఇచ్చారు.

మావో సాంస్కృతిక విప్లవం ధ్యేయం కొందరు విప్లవ వ్యతిరేకులను ఏరివేయడమని రెడ్‌గార్డులు తలవరాదని సంస్కరణవాదాన్ని ప్రతిఘటించాలని, విప్లవ వ్యతిరేకుల సాంఘిక ప్రాతిపదికను భగ్నంచేయాలని ఆ సిద్ధాంతాల ప్రాబల్యాన్ని తగ్గించాలని ప్రజలలో మావో సిద్ధాంతాలు బాగా పాతుకొనిపోయేలా చేయాలని రెడ్‌గార్డులకు సలహా ఇచ్చారు.

మావో సాంస్కృతిక విప్లవధ్యేయం అధికారంలో ఉన్నవారిని పడగొట్టడం కాదని కూడా రెడ్‌గార్డులకు స్పష్టంచేయబడింది. షాంఘైలోని మావో అనుకూల విప్లవ విద్యార్థివర్గం గోడ వార్తాపత్రికలలో ఈ సూచనల అన్నింటిని వ్రాసింది. ఈ సలహాలను అధికార వార్తాపత్రిక పీపుల్స్ డైలీ ప్రచురించింది. ఈ సూచనలను పీపుల్స్‌డైలీ ప్రశంసించింది. పెట్టుబడిదారీ ఎంతాను అనుసరించేవారిని అధికారం నుంచి తొలగించడం సరిఅయిన చర్యేనని అయినా రెడ్‌గార్డులు వేగిరపడరాదని సలహా ఇచ్చింది.

మావో సాంస్కృతిక విప్లవ నిర్వాహకులు అధికారాన్ని హస్తగతం చేసుకొనడానికి సాగిస్తున్న పోరాటం అంతంకాలేదు. గత ఎనిమిది నెలలుగా ఈ కృషి అద్భుతమైన విజయాలను సాధించిందని ఇంకా సాధించవలసింది చాలాకలదని రెడ్‌గార్డులు పూర్తిగా సైనికధోరణిలో వ్యవహరించరాదని కూడా ఈ పత్రిక కోరింది.

విప్లవకమిటీలలో మాజీ కమ్యూనిస్టు వర్గాలకు ప్రాతినిధ్యం

బెర్లిగ్రేడ్, ఫిబ్రవరి 26— మావో అనుకూల విప్లవ కమిటీలలో కమ్యూనిస్టుపార్టీ మాజీ అధికారులను చేర్చుకుంటున్నారని పీకింగ్‌లోని యుగోస్లావ్ వర్గాలద్వారా అందిన సమాచారం తెలుపుతున్నది.

విప్లవ అధికారవర్గంలో పూర్వపు కేడర్‌లో వారిని చేర్చుకొనడం సముచితమని హాంగ్‌చీ పత్రికలో ఒక వ్యాసాన్ని ప్రచురించారు. మావో వర్గాలు అధికారాన్ని స్వాధీనంచేసుకున్న రాష్ట్రాలలో ఇట్టి కమిటీలు ఏర్పరచబడుతున్నాయి.

పికింగ్‌లో విప్రజారక్షణ వ్యవహారాలను చూసే సైనిక కమిటీ ఎనిమిది అఖిల చైనా సంస్థలను నిషేధించింది. ఈ సంస్థలన్నీ విప్లవ వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నాయిని ప్రకటించబడింది.

ప్రజారక్షణ వ్యవహారాల సైనిక కమిటీ రెండు వారాలక్రితం ఏర్పరచబడింది.

అమెరికా సరఫరాచేసే ఆహారధాన్యం

ఎక్కువగా ప్రచారం జరగాలని అభిలాష

న్యూఢిల్లీ ఫిబ్రవరి 26— ఇరువది లక్షల టన్నుల అమెరికన్ ఆహారధాన్యాల సరఫరాకు ఈ మధ్య కుదుర్చుకున్న ఒప్పందంలో ఆ సహాయాన్ని గురించి ప్రచారం చేయాలని ఒక షరతు ఉన్నది.

అమెరికా ఆహారధాన్యాలగురించి అవి ఎలా ఎక్కడినుంచి లభించాయో ప్రచారం చేసేవిషయమై ఢిల్లీ, వాషింగ్టన్ అధికారులు సంప్రతించగలరని తలవబడుతున్నది.

అమెరికా ఆహారధాన్యాలను అమ్మే ప్రదేశంలో "శాంతికొరకు ఆహారం"గా ఈ ధాన్యాలు ఇవ్వబడినాయని ప్రచారం చేయాలని అమెరికా అధికారులు కోరుతున్నారు. కాని, ఇది అంగా ఆచరణయోగ్యమైన సూచనకాదు.

అమెరికా అధికారుల ప్రధాన ఆకాంక్ష భారతీయులకు రేషన్ షాపులలో లభ్యమయే ధాన్యం అమెరికా నుంచి లభిస్తున్నదిగాని రష్యా నుంచికాదని ప్రజలకు తెలియజెప్పడమే.

క్రితం సంవత్సరం అమెరికా అప్పనిస్తానికు సరఫరా చేసిన గోధుమలను ఆదేశంలో రవ్వలుగా నిర్మించిన డేకరీలకు సరఫరాచేసి రవ్వలు రొట్టెలుగా వాటిని విక్రయించడం జరిగింది.

అమెరికా భారతదేశానికి సరఫరాచేసే ధాన్యాన్ని గురించి ప్రజలకు చెప్పడం జరుగుతూనే ఉన్నది. కాని ఈ విషయం విస్తృతంగా ప్రచారం కావాలని అమెరికన్ అధికారులు కోరుతున్నారు.

ఈ కొత్త ఆహార ఒప్పందంలోని మరొకాంశం ఈ ధాన్యం అమ్మకంవల్లవచ్చే డబ్బులో ఇక్కడికి అమెరికా రాయబార కార్యాలయానికి కేటాయించేదానిలో 5 శాతం డాలర్లలోకి మార్చుకొనే హక్కును ఇవ్వడం క్రితం సంవత్సరం ఒప్పందంలో 3 శాతాన్ని మాత్రమే డాలర్లలోకి మార్చుకొనే సౌకర్యం ఇవ్వబడింది. కాని ఇప్పటికి ఒకశాతం మాత్రమే డాలర్లలోకి మార్చుకొనడం జరిగింది

రాష్ట్రాలకు హెచ్చు అధికారాలు

కేరళ కొత్తప్రభుత్వం యత్నించగలదని నంబూద్రిపాద్ ప్రకటన

తిరువేంద్రం, ఫిబ్రవరి 26— కేరళలో ఏర్పాటుకానున్న బ్యాన్ సంఘటన ప్రభుత్వం రాష్ట్రాలకు హెచ్చు స్వాతంత్ర్యం కోసం పాటుపడగలరని అతివాద కమ్యూనిస్టు నాయకుడు శ్రీ నంబూద్రిపాద్ మొన్న యిక్కడ చెప్పారు.

విన్న తిరువేంద్రం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటైన పిందలో రాష్ట్రాలకు హెచ్చు స్వాతంత్ర్యం కోసం రాజ్యాంగాన్ని సవరించాలని ఐక్యసంఘటన ప్రయత్నంకోరగలదా? అని అడుగగా సంబూద్రిపాద్ సమాధానమిస్తూ ఇది కొత్తపార్లమెంటులో బలాబలాలతో సహా పెట్టుబడులపై ఆధారపడి వున్నదన్నారు.

రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా సవరించకపోయినా హెచ్చుస్వాతంత్ర్యంకోసం తాము తప్పక పోరాడగలమన్నారు.

రాష్ట్రాలకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాలను గతపదేళ్ళుగా కేంద్రం క్రమక్రమంగా తనఅధీనంలోకి తీసుకుంటున్నదన్నారు.

కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడనున్న కేరళకు, కేంద్రానికి మధ్య సంబంధాలు కేంద్రప్రభుత్వ కొత్త స్వరూపంపై ఆధారపడి వుంటాయన్నారు

కేరళలో ప్రంటులోని ఏడు పార్టీల అభిప్రాయాలకి అనుగుణంగా నాయకునిఎన్నిక జరగ గలదన్నారు.

రాజకీయ కారణాలపై ప్రంటులోని ఏ పార్టీకి మంత్రివర్గంలో స్థానం నిరాకరించబడదని ఆయన అన్నారు.

తూర్పు జావాలో భూకంపం

జకర్తా, ఫిబ్రవరి 26— తూర్పు జావాలోని మాలాంగ్ ప్రాంతంలో అదు పెకండ్ల పాటు కల్గిన భూకంపంలో 26 మంది చనిపోయారు. డజన్లకొద్ది గాయపడినారు. ఈ భూకంపంవల్ల 25 మసీదులు ప్రభుత్వ భవనాలు ఇండ్లు కూలిపోయాయి.

"ధరల నిరోధానికి అధికోత్పత్తి సాధనే శరణ్యం"

డచ్ నిపుణుని అభిప్రాయం

బొంబాయి, ఫిబ్రవరి 26— ధరలను తగ్గించడానికి రసాయనపు ఎరువుల వాడకం ద్వారా అధికోత్పత్తి సాధించడమే ఏకైక మార్గం.

ప్రస్తుతం ఇండియాలో పదిరోజుల పర్యటన సాగిస్తున్న డచ్ రాజనీతిజ్ఞుడు, ఆర్థిక నిపుణుడు డాక్టర్ డి. యు. స్టిక్కర్ ఈ అభిప్రాయాన్ని వ్యక్తపరచారు. ఆయన ఐక్య రాజ్యసమితి వాణిజ్యం, అభివృద్ధి వ్యవహారాలసభ సలహాదారుగా ప్రపంచ పరిశీలన యాత్ర జరుపుతూ ఇండియాకు వచ్చారు.

తమ ఆర్థిక సమస్యలపట్ల వివిధ దేశాల ప్రజలు అవలంభిస్తున్న వైఖరుల గురించి స్థూలంగా తెలుసుకొనడమే తన ప్రస్తుత పర్యటనోద్దేశమనిఆయన ఒక ఇంటర్వ్యూలో తెలిపారు.

డాక్టర్ స్టిక్కర్ వర్తమాన దేశాల ఆర్థిక పరిస్థితులను, ప్రత్యేకించి జాతీయ, అంతర్జాతీయపు ప్రయివేట్ పెట్టుబడుల పాత్ర గురించి పరిశీలిస్తున్నారు. ఆయన తన నివేదికను ఈ సంవత్సరం చివరలో సమితి ఉపసంఘానికి సమర్పిస్తారు. [నాషెన్].

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికైన మరికొందరు

శ్రీ కనుమూరి సోమేశ్వరరావు

శ్రీ కె. ఎస్. నారాయణ

శ్రీ గెడ్డం మహాలక్ష్మి

శ్రీ యడ్లపాటి వెంకట్రావు

శ్రీ కె. కాంతయ్య

శ్రీ యాళ్ల సూర్యనారాయణమూర్తి

వివిధ రాష్ట్రాలలో లెజిస్లేచర్ పార్టీ నాయకుల ఎన్నిక సమస్య

దిగువసభకుచెందినవారు మాత్రమే అర్హులని కాంగ్రెసు అధ్యక్షుని సూచన

లక్నో, ఫిబ్రవరి 26—

రాష్ట్ర కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీల నాయకులను దిగువ సభల నుంచి ఎన్నుకొనవలసి వుంటుంది

ఈ విషయమై కాంగ్రెసు అధ్యక్షుడు రాష్ట్ర శాసనసభ సభ్యులకు తగు ఆదేశాలు జారీచేస్తున్నట్టు ఇక్కడ తెలియవచ్చింది.

ఈ సూచన ప్రకారం కాంగ్రెసు ముఖ్యమంత్రు లందరు రాష్ట్ర శాసనసభలకు చెందినవారు అవుతారు.

ఇతర మంత్రులు కూడా దిగువసభసభ్యుల నుంచే నియమితులౌతారు.

కాంగ్రెసు పెద్ద లెవరైనా వుంటే లేదా ఎగువ సభలలో సమర్థులైనవారు వుంటే వారిని ఈ నిబంధననుంచి మినహాయిస్తారు.

ఈ సారి పరాజితులైన మంత్రులకు వెనుక దారిని స్థానం కల్పించడం జరగబోదని భావిస్తున్నారు. (నాషెన్)

కాంగ్రెసుసంస్థ ఎన్నికలు

త్వరలో జరిపించే విషయమై 27వ తేదీన వర్కింగ్ కమిటీచర్చ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 — కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సమావేశం ఈ నెల 27వ తేదీన ఇక్కడ జరుగనున్నది.

ఎన్నికలలో పెక్కుచోట్ల కాంగ్రెసు ఓడిపోయిన కారణంగా పార్టీని తిరిగి పునరుజ్జీవింప చేయడానికి వీలుగా సంస్థ ఎన్నికలు జరపడాన్ని గురించి ఈసమావేశం చర్చించగలదు.

ఏప్రిల్‌నెలలో ఎన్నికలు ప్రారంభించవలసిందిగా ప్రదేశ్ కాంగ్రెసు సంఘాలను కోరినా ఈ ఏడాది చివరకు మాత్రమే అవి పూర్తి కాగలవని అఖిలభారత కాంగ్రెసు వర్గాలవారన్నారు.

అంతవరకు శ్రీ కామరాజ్ పార్టీనాయకత్వం కొనసాగించాలని కార్యవర్గం ఆయనను కోరవచ్చు.

ఎన్నికలలో ఓడిపోయిన కాంగ్రెసు అగ్రనాయకులను పూర్తికాలం పార్టీనిర్మాణ కృషికి వినియోగించుకొన వచ్చునని ఎ. ఐ. సి. సి. వర్గాలవారు అభిప్రాయ పడుతున్నారు.

ఉత్తరప్రదేశ్‌లో మూడవసప్లిమెంటరీ బడ్జెట్టుకు అవకాశం

లక్నో, ఫిబ్రవరి 26 — ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మూడవ సప్లిమెంటరీ బడ్జెట్టును ప్రవేశపెట్టగలదని భావిస్తున్నారు

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిపుణులు సప్లిమెంటరీ బడ్జెట్టును రూపొందిస్తున్నారు. దాన్ని వచ్చేనెల మధ్య రాష్ట్ర శాసనసభలో ప్రతిపాదించవచ్చు.

మొదటి సప్లిమెంటరీ బడ్జెట్టును వర్షాకాల సమావేశంలోను. రెండవదాన్ని డిసెంబర్‌లోను ప్రవేశపెట్టారు.

ఈ రాష్ట్రంలో ఒకే ఏడాదిలో రెంటికన్నా ఎక్కువ బడ్జెట్టును మున్నెన్నడూ ప్రతిపాదించలేదు. దురిక్ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది మూడవ బడ్జెట్టును సమర్పించవలసి వచ్చింది.

బీహార్‌లో కాంగ్రెసు పార్టీ భావి కర్తవ్యం

మార్చి మొదటి వారంలో పార్టీ సభ్యుల సమాలోచనలు

పాట్నా, ఫిబ్రవరి 26— బీహార్ కాంగ్రెసు లెజిస్లేచర్‌పార్టీ కొత్త సభ్యులు మార్చి మొదటివారంలో సమావేశమై తమ భావిక కర్తవ్యాన్ని గురించి, పార్టీ నాయకుని ఎన్నికగురించి చర్చిస్తారు.

ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ రాజేంద్రమిశ్రా నేడు అఖిలభారత కాంగ్రెసుకార్యదర్శి శ్రీ షాదిక్ అలీతో టెలిఫోన్‌ద్వారా సమాలోచనలు జరిపారు.

బీహార్‌లో పూర్తి మెజారిటీని సాధించడంలో కాంగ్రెసు విఫలమైనందున ఉత్పన్నమైన పరిస్థితిగురించి వారు చర్చించినట్టు తెలుస్తున్నది.

పార్టీ కొత్త సభ్యులు మార్చి మొదటి వారంలో సమావేశం కావాలని శ్రీ సాదిక్ అలీ సూచించినట్టు తెలుస్తున్నది. కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్‌తో సంప్రతించిన పిదు తేదీని నిర్ణయించగలమని కూడా ఆయన చెప్పారు.

ఒరిస్సాలోని అంగుల్ నియోజకవర్గం నుంచి స్వతంత్రపార్టీ అభ్యర్థి శ్రీ దీరేంద్రనాథ్ దేవలాల్ లోకసభకు ఎన్నికైనట్టు కటక్ వార్త.

తిరిగి వోట్ల లెక్కింపు జరగాలన్న మీనన్ వాదం త్రోసివేత

బొంబాయి, ఫిబ్రవరి 26— ఉత్తర బొంబాయిలోని రెండు ముఖ్యమైన లోకసభ సీట్లను కాంగ్రెసు గెలుచుకున్నది. ఇక్కడ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీ చేసిన మాజీ రక్షణ మంత్రి శ్రీ కృష్ణమీనన్, బొంబాయి హైకోర్టు మాజీ జడ్జి శ్రీ హెచ్. ఆర్. గోఖలే ఓడిపోయారు.

శ్రీ మీనన్‌పై కాంగ్రెసు అభ్యర్థి శ్రీ ఎస్. జి. బార్వే విజయాన్ని విన్నర్తి ప్రొద్దుపోయిన పిదప ప్రకటించారు. ప్రకటనకు ముందు శ్రీ మీనన్ ఓట్లను తిరిగి లెక్కపెట్టించాలని. లేదా తిరిగి ఎన్నిక జరిపించాలని ప్రయత్నించారు, అయితే, అరుగంటల పాటు వాదోపవాదాలు జరిగిన పిమ్మట రిటర్నింగు ఆఫీసర్ శ్రీ మీనన్ వాదాన్ని త్రోచి పుచ్చారు.

బొంబాయిలో అయిదు లోకసభ సీట్లు వున్నాయి. వీటిలో మూడు కాంగ్రెసు వశమైనాయి. రైల్వే మంత్రి శ్రీ ఎస్. కె. పాటిల్ పరాజయంలో కాంగ్రెసుకు పెద్దదెబ్బ తగిలింది. ఆయనపై ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీ జార్జి ఫెర్నాండెజ్ గెలిచారు. మరొక బొంబాయి సీటును మితవాదకమ్యూనిస్టు పార్టీ అభ్యర్థుడు శ్రీ ఎస్. ఎ. డాంగే గెలిచారు.

భోపాల్, ఫిబ్రవరి 26— మధ్యప్రదేశ్‌లో ఈ ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయిన ఏడుగురు మంత్రులు తమ రాజీనామాను అందచేశారు.

ముఖ్యమంత్రి శ్రీ డి. పి. మిశ్రా తమ మంత్రి మండలి రాజీనామాను మార్చి మొదటి తేదీన గవర్నర్‌కు అందచేస్తారు.

ఓడిపోయిన మంత్రులు శ్రీ మిశ్రిలాల్ గంగవాల్, శ్రీ గౌతమ్‌శర్మ, శ్రీనరసింగ రావుదీక్షిత్, శ్రీ పాటిదార్, శ్రీ ఎస్. ఎస్. ఖషానే గుర్ పేర్ అహ్మద్, శ్రీఅర్జున్‌సింగ్.

విద్రోహచర్యల వల్ల విద్యుత్ అసౌకర్యం

డాక్టర్ టి. వి. ఎస్ చలపతిరావు ఖండన

హైదరాబాద్, ఫిబ్రవరి 26—

విద్యుచ్ఛక్తి సరఫరాకు అంతరాయం కల్గించడాన్ని విద్రోహ చరలకు ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి పనివారల సంఘం అధ్యక్షులు డాక్టర్ టి. వి. ఎస్. చలపతిరావు ఖండించారు. ఈ సమ్మెలో జోక్యం కల్పించుకొని విద్యుచ్ఛక్తి బోర్డుకు కలిగే నష్టాన్ని ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని నివారించవలసిందిగా ముఖ్యమంత్రిని ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుని ఆయన కోరారు.

డాక్టర్ చలపతిరావు ఒక పత్రికా ప్రకటనలో విధ్వంస చర్యలను మాని శాంతియుతంగా సమ్మెను జరుపవలసినదిగా పనివారలకు సలహాఇచ్చారు.

నిద్రోహ చర్యల వల్ల విద్యుచ్ఛక్తి పనివారలు ప్రజా సానుభూతిని సహాయాన్ని కోల్పోగలరని హెచ్చరించారు.

ఈ సమ్మె వల్ల విద్యుచ్ఛక్తి ఉత్పాదక కేంద్రానికి నష్టం కలిగి ప్రజలకు తప్పని సరిగా అసౌకర్యం కలుగుతున్నందుకు డాక్టర్ రావు తమ విచారాన్ని వ్యక్తం చేశారు.

నిడదవోలులో అరెస్టులు

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

నిడదవోలు, ఫిబ్రవరి 26— ఇక్కడి సమ్మెలోవున్న 153 మంది విద్యుచ్ఛక్తి పనివారలను సబ్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఫరీద్ అరెస్టు చేశారు. వీరిని 14 రోజులు రిమాండులో వుంచడానికి ఫస్ట్ అడిషనల్ మున్సిఫ్ మెజిస్ట్రేటు అనుమతిచ్చారు.

చైనా ఎగుమతి వ్యాపారంపై మావో సాంస్కృతిక విప్లవం అధికారం కొరకై జరుగుతున్న ఘర్షణలు చెప్పదగిన ప్రభావాన్ని వేయలేదని పీకింగ్ వార్త.

ఇండియాలో జనరల్ ఎన్నికలు

బ్రిటిష్ పత్రికల వ్యాఖ్య

లండన్, ఫిబ్రవరి 26— భారత జనరల్ ఎన్నికల ఫలితాలపై బ్రిటన్‌లో అమిత ఆసక్తి కన్పిస్తుంది.

ఇప్పటివరకు బ్రిటిషు వార్తా పత్రికలు టెలివిజన్, రేడియో భారత వ్యవహారాలపై తక్కువ ఆసక్తినే కలిగివున్నా ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు మొదటి పేజీలోనే భారతవార్తలు పత్రికలలో ప్రచురించబడుతున్నాయి. ఇదేవిధంగా బ్రిటిషు రేడియో, టెలివిజన్‌లలో కూడా భారత ఎన్నికలకు ప్రాధాన్యం హెచ్చింది.

ఈవినింగ్ స్టాండర్డు పత్రిక అధికారం కొరకు జరిగిన ఓట్ల పోరాటం ఇండియాను కదల్చివేసిందని శీర్షిక పెట్టింది. లండన్ టైమ్స్ భారత ఎన్నికల వార్తలు మొదటి పేజీలోనే ప్రచురించింది. గార్డియన్ పత్రిక తొలగించి వేయబడిన ఒక భారతీయ తరం అన్న శీర్షికతో సంపాదకీయ వ్యాసాన్ని వ్రాసింది

ఈ సారి కాంగ్రెసు తక్కువ స్థానాలు గెలువగలదనిఅంతాఆశిస్తూ ఉన్నా కాంగ్రెసు పొందిన అపజయాలు అత్యధికమని చాలా మంది ప్రముఖ నాయకులు ఓడిపోయారని గార్డియన్ పత్రిక అభిప్రాయపడింది. భారతీయులు ప్రభుత్వాన్నికాక ప్రభుత్వయంత్రాంగాన్ని నడిపే శక్తిని కాంగ్రెస్‌ను ఈసారి అవమానపరచారని కాంగ్రెస్ ఈ తడవ అధికారంలో వున్నా దాని అధికారవర్గంలో పెద్ద రంధ్రం సృష్టించబడిందని కాంగ్రెసనే బ్రహ్మాండమైన వటవృక్షం ఎట్టికేలకు కూలిపోప్రారంభించిందని ఈ పత్రిక వ్యాఖ్యానించింది.

చైనాలో అధికారంకొరకు జరుగుతున్న అంతర్యుద్ధంవలెకాక భారతదేశంలో నాల్గవ జనరల్ ఎన్నికలు ఒక తరంనుంచి రెండవ తరానికి అధికారాన్ని హస్తగతం చేయడంలో ఆరోగ్యకరమార్గాన్ని సృష్టించాయని గార్డియన్ పత్రిక ఆశాభావంతో తన సంపాదకీయాన్ని ముగించింది.

కొత్త లోకసభలో ఆంధ్రప్రతినిధులు

తెలుసుకొనదగిన కొన్ని విశేషాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 26—

ఆంధ్రప్రదేశ్ నుంచి లోకసభకు జరిగిన ఎన్నికలలో కాంగ్రెసుకు మొన్నెన్నడురాని విజయం లభించగా, కమ్యూనిస్టులకు లాగద మూడు ఎన్నికలలోను ఎరుగని పరాజయం కలిగింది.

ఆంధ్రప్రదేశ్ నుంచి లోకసభకు జరిగిన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం 41 స్థానాలలో కాంగ్రెసుకు 35 స్థానాలు లభించాయి ఒక విధంగా ఇది కాంగ్రెసుకు ఘనవిజయమనే చెప్పాలి ఎందువల్లనంటే, కిందటిసారి ఎన్నికలలో కాంగ్రెసుకు 34 స్థానాలు మాత్రమే లభించాయి.

పోతే, ఈ ఎన్నికలలో రెండవపరాజయం పొందింది కమ్యూనిస్టులు. కిందటిసారి ఎనిమిదిస్థానాలను సంపాదించిన కమ్యూనిస్టు పార్టీ ఈసారి ఒక్కస్థానమే సంపాదించింది.

అన్నింటికంటె మరొక విశేషంవుంది. 1952 ఎన్నికలలో నల్లగొండ పార్లమెంటు స్థానం నుంచి లోకసభకు పోటీ చేసిన కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ రావి నారాయణ రెడ్డికి దేశంలో ఏ అభ్యర్థికి లానంతటి హెచ్చు మెజారిటీ వచ్చింది. కాని, ఈ సారి అదే నియోజకవర్గం నుంచి కాంగ్రెసు అభ్యర్థి గెలుపొందడం పెద్ద విశేషం. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలోని రెండు లోకసభ నియోజకవర్గాలు కాంగ్రెసుకే లభించడం మరొక విశేషం.

స్వతంత్రపార్టీకి కిందటిసారి ఎన్నికలలో ఒక్క లోకసభ స్థానమే లభించింది, కాని, ఈసారి దానికి మూడుస్థానాలు లభించాయి. అయితే, ఆ పార్టీ అధ్యక్షుడు ఆచార్య రంగా ఓడిపోవడం జరిగింది.

ఈ చిత్తూరు లోకసభ స్థానంలో కిందటిసారి జనరల్ ఎన్నికలలో శ్రీ అనంతశయనం అయ్యంగార్ ఎన్నికైనారు. ఆ తర్వాత ఆయన బీహార్ గవర్నర్‌గా నియమితులైనందున జరిగిన ఉప ఎన్నికలలో ఆచార్యరంగా పోటీ చేసి గెలిపొందారు. అప్పుడు కాంగ్రెసు అభ్యర్థి శ్రీ రామిరెడ్డి. ఈసారి శ్రీ రంగాపై గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ ఎస్. పి. రంగల్వరాయ నాయుడు.

అధ్యక్ష ఎన్నికలలో ఒక సినిమా నటుని పార్లమెంటుకు పంపిన ఘనత కాంగ్రెసుకు లభించింది. ఒంగోలు నుంచి శ్రీ కె జగ్గయ్య కాంగ్రెసు అభ్యర్థిగా ఎన్నికైనారు. ఈ నియోజకవర్గం మొన్నటివరకు కమ్యూనిస్టులకు బలమైన కేంద్రంగా పరిగణింపబడింది.

ఐందరు పార్లమెంటుసీటు నుంచి శ్రీ పైడి అంకినీడు ప్రసాద్ ఎన్నికైనారు.అదే నియోజక వర్గంలోని అవనిగడ్డ నుంచి ఆయన తండ్రి శ్రీ శివరామప్రసాద్ అసెంబ్లీకి ఎన్నికైనారు. ఇది కూడా విశేషమేననిచెప్పాలి.

కర్నూలు నుంచి లోకసభకు జరిగిన ఎన్నికలో కేంద్రమంత్రి శ్రీ పి. సంజీవయ్య ఓటమి పొందారు. వజీర్వర్గీయులు శ్రీ మద్ది సుబ్రహ్మణం నరసరావుపేట నియోజకవర్గంనుంచి లోకసభకు ఎన్నికైనారు.

ప్రతిపక్షాలకు చెందిన శ్రీ యుతులు వెన్నేటి విశ్వనాథం, శ్రీ గొట్టి లచ్చన్నలు అసెంబ్లీ నియోజక వర్గాలతోపాటు లోకసభ సీట్లను కూడా పోటీచేసి గెలుపొందారు. వీరిలో శ్రీ విశ్వనాథం లోకసభ సీటును వుంచుకొనగలరని, శ్రీ లచ్చన్న అసెంబ్లీ సీటును వుంచుకొనగలరని ఒక ఊహాగానం.

అతివాద కమ్యూనిస్టు నాయకుడు శ్రీ మోటూరి హనుమంతరావు ఐందరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఓడిపోయారు.

కేంద్ర మంత్రి శ్రీ రఘురామయ్య గుంటూరు పార్లమెంటు నియోజక వర్గం నుంచి లోకసభకు అత్యధికమైన ఓట్ల మెజారిటీలో గెలుపొందారు. ఆయనకు లక్ష 17 వేల ఓట్ల మెజారిటీ లభించింది.

ఆంధ్రలో డిపాజిట్లు కోల్పోయిన అభ్యర్థులు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 26— క్రితం ఎన్నికల కన్న ఈ ఎన్నికలలో రాష్ట్రశాసన సభకు పోటీచేసిన వారిలో అధిక సంఖ్యలు డిపాజిట్లు కోల్పోయారు.

1962 ఎన్నికలలో 353 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోగా ఈ ఎన్నికలలో 432 మంది డిపాజిట్లను కోల్పోయారు. ఈ ఎన్నికలలో 247 మంది ఇండిపెండెంట్ల డిపాజిట్లు గల్లంతయాయి. రాజకీయ పక్షంగా జనసంఘం 69 డిపాజిట్లు కోల్పోయింది. తర్వాత మితవాద కమ్యూనిస్టులు 44 మంది, స్వతంత్రపార్టీ అభ్యర్థులు 28 మంది, అతివాద కమ్యూనిస్టులు 24 మంది, రిపబ్లికన్ పార్టీ 10. ఎస్.ఎస్.పి. అయిదు, పి.ఎస్.పి. ఒక డిపాజిట్ కోల్పోయారు. క్రితం ఎన్నికలలో కమ్యూనిస్టులు ఎనిమిది స్థానాలలో మాత్రమే డిపాజిట్లు కోల్పోయారు. స్వతంత్రపార్టీ క్రితంమారు 70 డిపాజిట్లు కోల్పోయింది.

పార్లమెంటుకు పోటీచేసిన వారిలో 44 మంది ఇండిపెండెంట్లు,స్వతంత్ర 7. మితవాద కమ్యూనిస్టులు 7. జనసంఘం 3, ఎస్. ఎస్. పి. 3, రిపబ్లికన్ పార్టీ 2, అతివాద కమ్యూనిస్టు, పి.ఎస్. పి. ఒక్కొక్క డిపాజిట్ కోల్పోయారు.

ఈ తడవ ఎన్నికలలో 72 మంది కాంగ్రెస్ శాసన సభ్యులు పోటీ చేసి ఓడిపోగా అతివాద కమ్యూనిస్టు ఎం. ఎస్. ఎ. లు ఇద్దరు, మితవాద కమ్యూనిస్టు ఎం.ఎల్. ఎ. లు 10 మంది ఇండిపెండెంటు ఎం, ఎల్. ఎ.లు 7. స్వతంత్ర ఎం.ఎల్.ఎ.లు ఇద్దరు ఎస్.ఎస్.పి. ఎం. ఎల్. ఎ. ఒకరు ఓడిపోయారు.

లోకసభకు పోటీచేసిన ముగ్గురు కాంగ్రెస్ ఎం.పి.లలో స్వతంత్రపార్టీ ఎం.పి లు ఇద్దరు అతివాద కమ్యూనిస్టు ఎం. పి. లు ఇద్దరు మితవాద కమ్యూనిస్టు ఎం. పి. ఒకరు ఓడిపోయారు. ఈ తడవ అసెంబ్లీకి పోటీచేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి శ్రీ బాలకోటయ్యకు 164 ఓట్లు వచ్చాయి. ప్రస్తుత ఎన్నికలలో ఇంత తక్కువ ఓట్లు ఎవరికీ రాలేదు.

కాశ్మీర్ వార్షిక ప్రణాళిక

1967-68 వ్యవసాయపు లంపనాలు

జమ్మూ, ఫిబ్రవరి 26— 1967-68 వార్షిక ప్రణాళికకు కాశ్మీర్ ప్రభుత్వం రు. 2204 లక్షలు ప్రత్యేకించింది. క్రితం సంవత్సరం వార్షిక ప్రణాళికకు రు. 2090 లక్షలు ఖర్చుచేయబడినవి.

ప్లానింగ్ కమిషన్ ఆమోదించిన కాశ్మీర్ రాష్ట్ర వార్షిక ప్రణాళికా వ్యయం రు. 126 కోట్లు.

1967-68 లో వ్యవసాయాభివృద్ధికి రు. 3 కోట్ల 90 లక్షలు పరిశ్రమలు గనులకై రు. 3 కోట్ల 90 లక్షలు రవాణా కమ్యూనికేషన్లకై రు. ఒక కోటి 92 లక్షలు ఖర్చు చేస్తారు.

వివిధ రాష్ట్రాలలో లోకసభ ఎన్నికల ఫలితాలు

[శనివారం అర్ధరాత్రి పరిస్థితి]

| రాష్ట్రం | మొత్తం సీట్లు | ప్రకటించిన ఫలితాలు | కాం

నిజాం నవాబు అంత్యక్రియలు — ఐదు లక్షలమంది కడసారి వీడ్కోలు



హైదరాబాద్‌లో మక్కా మసీదువద్ద నిజాం నవాబ్ శవపేటికను శతఘ్ని శకటంపైకి ఎక్కిస్తున్న ప్రిన్స్ ముకరంజా



నిజాం నవాబ్ భౌతికకాయం ఊరేగింపులో పాల్గొన్న ఐదు లక్షల ప్రజానీకం

నిజాం నవాబ్ భౌతికకాయానికి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి, ఆర్థికమంత్రి డాక్టర్ చెన్నారెడ్డి ప్రభృతులు పుష్పమాలలు సమర్పించారు

'విజయాభవ!'

కాంగ్రెసుకు ఓటరు దీవెన

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

రాజోలు, ఫిబ్రవరి 26 — కాంగ్రెసును ఓటర్లు మాటలలో, చేతలలో కాక వ్రాతలలో కూడా దీవించారు.

నగరం నియోజకవర్గానికి చెందిన ఒకబూత్‌లోని పెట్టెలో తీసిన బ్యాలెట్ పత్రంపై ఇలా వున్నది: "ధారత్ ఎన్నికలలో కాంగ్రెస్ విజయమొందుగాక!"

"అవివేకం"

అమలాపురం నియోజకవర్గానికి చెందిన ఒక బ్యాలెట్ పత్రంపై "ఈ పార్టీలకు ఓటు చేయడం అవివేకం" అని ఆంగ్లంలో వ్రాసిపోయాడు.

ఓటర్ల అలక

చింతాడలో రెండు ఓట్లే పడిన వైనం

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

రాజోలు, ఫిబ్రవరి 26 — అల్లవరం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన చింతాడలో 758 మంది ఓటర్లు వున్నారు. ఈ గ్రామాన్ని ఓటుచేయడానికి సమీప గ్రామం అయిన రోళ్ళపాలెం పోలింగు స్టేషనులో కలిపారు.

తమ గ్రామంలో ప్రత్యేక పోలింగు స్టేషన్‌ను నెలకొల్పలేదని ఆగ్రహం చెందిన చింతాడ ఓటర్లు ఎన్నికలలో పాల్గొనడానికి నిరాకరించారు.

16 వ నెంబరు పోలింగు స్టేషను పెట్టె తెరచి చూడగా ఇద్దరు ఓటర్లు పోల్‌చేసిన నాలుగుబ్యాలట్ పత్రాలుమాత్రమే అందులో వున్నాయి. ఇద్దరు అసెంబ్లీకి కాంగ్రెసు అభ్యర్థికి, పార్లమెంటుకు ఒకరు రిపబ్లికన్ అభ్యర్థికి, మరొకరు కాంగ్రెసు అభ్యర్థికి ఓటు చేశారు.

తాడేపల్లిగూడెంలో కోళ్ళ ఫారం

శ్రీ బి. ముత్యాలరావుచే ప్రారంభోత్సవం

తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 29— తాడేపల్లిగూడెం కోళ్ళ ఫారంను పరిశ్రమల డిప్యూటీ డైరెక్టర్ శ్రీ బి. ముత్యాలరావు ఇటీవల ప్రారంభోత్సవం చేశారు. ఫారం శ్రీయుతులు వెలగాల భాస్కరరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యాన నడుస్తున్నది.

పశ్చిమ గోదావరిజిల్లా వైద్యాదికారి డాక్టర్ టి ఎస్ జోగిరాజు కోళ్ళ గృహానికి ప్రారంభోత్సవం జరిపి సభకు అధ్యక్షత వహించారు ఉప్పత్తి కేంద్రానికి శ్రీ వి. బ్రహ్మలింగం ప్రారంభోత్సవం జరిపారు.

డాక్టర్ రామారావు, హెచ్. పి. పురుషోత్తం మున్నగువారు ఈ సభలో ప్రసంగించారు.

కొంతవరకు ఆహార సమస్యను తామ పరిష్కరించగలమన్న ఆశాభావాన్ని భాస్కర రెడ్డి వ్యక్తపరచారు.

గుంటూరు, ఫిబ్రవరి 26— గుంటూరులో దేశరక్షణ నిబంధనల క్రింద 36 మంది విద్యుచ్ఛక్తి ఉద్యోగులను (హెల్పర్స్ వైర్‌మెన్) అరెస్టుచేశారు. వారిలో జిల్లా యూనియన్ సెక్రటరీ శ్రీ ఉమామహేశ్వర రావుకూడా వున్నాడు: అరెస్టుచేయబడిన వారు గుంటూరు సబ్‌డివిజన్‌కు చెందిన వారు.

'ఈ విజయం కార్యకర్తల కృషి ఫలితం'

గెలిచిన శాసనసభ్యుల ప్రకటనలో

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

ఏలూరు, ఫిబ్రవరి 26— "ఈ జయం మాదే కాదు. వందలకొంది మా సోదర కార్యకర్తలది. ఇది వారి నిరంతర కృషి ఫలితం ఈ సందర్భంగా మా నాయకులకు, అశేష సోదర కార్యకర్తలకు మా కృతజ్ఞతా వందనలు" అని ఏలూరు నియోజక వర్గం కాంగ్రెసు అభ్యర్థి శ్రీ మాలే వెంకటనారాయణ, దెందులూరు అభ్యర్థి శ్రీ మొదవర్తి రామమోహనరావు తమ విజయవార్త వినిన వెంటనే ప్రకటించారు.

శ్రీ మాలే వెంకటనారాయణను పురవీధులలో మొన్న 50 జతల ఎద్దులో పెద్ద ఎత్తున ఊరేగించారు. దారిపొడవున ఆయనను కర్పూరహారతులు పట్టి, కొబ్బరికాయలుకొట్టారు. చామంతి పూలదండలతో ఆయనను ముంచెత్తారు.

శ్రీ సీతారామయ్య కృతజ్ఞతలు

గన్నవరం, ఫిబ్రవరి 26— గన్నవరం నియోజకవర్గం నుంచి కాంగ్రెసు అభ్యర్థిగా శాసనసభకు అఖండ విజయం చేకూర్చి అందరికి సేవ చేసే సదవకాశం కల్పించిన ఓటరులకు, అవిరళకృషి సల్పిన కార్యకర్తలకు తదితర పెద్దలకు అభివందనలు తెలియచేస్తూ శ్రీ వెలిచెల సీతారామయ్య మొన్న ప్రకటించారు.

శ్రీ శ్రేష్ఠికి అభినందనలు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 26— మొన్న జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెసు అభ్యర్థి శ్రీ రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్ఠి ఎన్నికైన సందర్భంగా, పట్టణపు మిత్రులు, కాంగ్రెసు కార్యకర్తలు నినాదాలతో శ్రేష్ఠికి పూలదండలువేసి అభినందించారు పట్టణపు ప్రముఖులు శుభాకాంక్షలు అందచేశారు. నందిగామ, మక్కంపేట, జగ్గయ్యపేటలలో శ్రీ శ్రేష్ఠిని గొప్పగా ఊరేగించారు. శ్రీ శ్రేష్ఠి మహాత్మాగాంధి విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. ఇది కార్యకర్తల విజయంగా అదున వ్యాఖ్యానించి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పాలకొల్లు పురపాలకసంఘం ప్రత్యేకాధికారికి వీడ్కోలు

పాలకొల్లు, ఫిబ్రవరి 26— పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మునిసిపాలిటీలో మూడుసార్లు కమిషనర్, సెక్రటరీ, స్పెషల్ ఆఫీసరుగా పనిచేసి నిబ్బంది, ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న శ్రీ రాజనాల రామానుజులునాయుడు 16వ తేదీన పదవీ విరమణ చేసిన సందర్భంగా 19వ తేదీన నరసాపురం కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రామారావు అధ్యక్షతన ఇక్కడ ఘనంగా సన్మానించి ఆయనకు వీడ్కోలిచ్చారు.

శ్రీ రామానుజులునాయుడు పతాకావిష్కరణ చేశారు, ఆయన భార్య శ్రీమతి కృష్ణవేణి బాలలకు మిఠాయి పంచారు. శ్రీ వై. ఎ. పి. రామారావు, శ్రీ పుష్పమి స్వాగతపత్రాలను సమర్పించారు. ఇన్‌ఛార్జి సెక్రటరీ, స్పెషల్ ఆఫీసరు శ్రీ కె. సత్యనారాయణ స్వాగతం పలికారు. ఆచార్య ఎన్. కె. జర్మన్ స్పోర్ట్స్ బ్యూను బహూకరించారు. శ్రీ అల్లు రాజలింగయ్య ఉపన్యసించారు. శ్రీ జి. వి. రమణయ్య వందన సమర్పణం చేశారు.

మిర్యాలగూడెంలో హిందీ ఉన్నత పరీక్ష కేంద్రం

మిర్యాలగూడెం, ఫిబ్రవరి 26— వచ్చే జూలైలో దీపూరు హిందీ విద్యాపీఠంవారి "సాహిత్య భూషణ," సాహిత్యాలంకార" పరీక్షలను ఇక్కడ నిర్వహిస్తారు. ఈ పరీక్షలు హైదరాబాద్ హిందీ ప్రచారసభవారి "భూషణ", "విద్వాన్" పరీక్షలకు సమానం. వీటిని కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరికొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు గుర్తించాయి. హైదరాబాద్ హిందీ ప్రచారసభవారి "విశారద" పరీక్షలో ఉత్తీర్ణులైనవారు "సాహిత్య భూషణ"లోను, "భూషణ"లో ఉత్తీర్ణులైనవారు "సాహిత్యాలంకార్" పరీక్షలోను కూర్చోవచ్చు. వివరాలు" శ్రీ కె. శేషం రాజు, హిందీ కేంద్ర వ్యవస్థాపకులు, జిల్లా పరిషత్తు హైస్కూలు, మిర్యాలగూడెం"చిరునామాకు వ్రాసి తెలుసుకొనవచ్చు.

కరీంనగరంలో గాంధీజీ అస్థినిమజ్జన దినోత్సవం

కరీంనగరం, ఫిబ్రవరి 26 — గాంధీజీ అస్థి నిమజ్జన దినం పంచ్యాన్ని పురస్కరించుకొని కరీంనగరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఇటీవల సమావేశం జరిపి బైబిల్, గీత, కొరాన్, పవిత్ర మత గ్రంథాలను చదివి సామూహిక ప్రార్థనలు జరిపి గాంధీజీకి శ్రద్ధాంజలి ఘటించారు.

జిల్లా సర్వోదయ మండలి అధ్యక్షులు శ్రీ బి. వెంకటరామారావు గాంధీజీ సూచించిన 18 నిర్మాణ సూత్రాలను వివరించారు.

వివాహమహోత్సవం

రాజోలు, ఫిబ్రవరి 26— ఇక్కడికి సమీప గ్రామం ఉలుసుమర్రుకు చెందిన శ్రీ ఉలుసుమర్తి ప్రసాదరావు సోదరి సౌభాగ్యవతి ధనలక్ష్మి అనే అన్నపూర్ణను పుల్లేటికుర్రుకు చెందిన శ్రీ కాదంబరి సూర్యనారాయణ ద్వితీయపుత్రుడు చిరంజీవి చినసత్యనారాయణకు ఇచ్చి వివాహం జరిపారు. వధూవరులకు పలువురు శుభాకాంక్షలు అందజేశారు.

నిజాం నవాబ్ భౌతికకాయం ఊరేగింపులో పాల్గొన్న ఐదు లక్షల ప్రజానీకం

ఆరు కోస్తాజిల్లాలలో విద్యుత్ సప్లయికి అంతరాయం

తాడేపల్లి సమీపాన సమ్మెదారులు పవర్‌టవర్‌ను కూల్చివేసినట్టు ఆరోపణ

దాదాపు 24 గంటల తర్వాత సరఫరా పునరుద్ధరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 —

కడచిన 29 రోజులుగా సమ్మెచేసున్న విద్యుచ్ఛక్తి కార్మికుల విధ్వంసక చర్యలవల్ల రాష్ట్రంలోని ఆరు కోస్తా జిల్లాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పౌర జీవితం స్తంభించి పోయింది.

విజయవాడ, రాజమండ్రి, గుంటూరు పట్టణాలు అంధకారంలో మునిగిపోయాయి. పెక్కు పట్టణాలలో మంచినీటి సప్లయి దెబ్బతిన్నది.

విజయవాడ పట్టణానికిగల టెలిప్రింటర్ సర్క్యూట్లు ఆగిపోయాయి. నిన్న సాయంత్రం వార్తా పత్రికలు వెలువడలేదు.

సమ్మెదారులు గుంటూరు, విజయవాడల మధ్య తాడేపల్లి వద్ద ఒక ట్రాన్స్‌మిషన్ టవర్‌ను కూల్చివేసినట్టు ఆరోపించబడింది.

అయితే, పవర్ హౌస్‌లు యథాప్రకారం పనిచేస్తున్నాయని ఎలెక్ట్రిసిటీ బోర్డు అధికారులు చెప్పారు.

సమ్మెదారులు సైకిల్ చైన్స్‌ను, ఇనుప కడ్డీలను రువ్వడం ద్వారా, పవర్‌లైన్ టవర్స్‌ను కూల్చివేయడం ద్వారా విద్యుత్ సరఫరా మార్గాలను విధ్వంసంచేసినట్టు చెప్పబడుతున్నది.

ఈ విధ్వంసకాండ ఎక్కడెక్కడి సాగిందో తెలుసుకుని, దాన్ని చక్కదిద్దడానికి కొంత వ్యవధి పడుతుందని చీఫ్ ఇంజనీరు అన్నారు.

తెలంగాణా సిబ్బంది సమ్మె బెదరింపు

ఆంధ్ర జిల్లాలలో పరిస్థితి నానాటికి క్షీణిస్తుండగా తెలంగాణా ప్రాంతం కూడా సమ్మె బెదరింపులకు లోనౌతున్నది. అక్కడి కార్మికులు డిపార్టుమెంట్‌కు అందజేసిన సమ్మె నోటీసు కాలం నిన్నటితో ముగిసింది. నేడు వారు సమ్మెలో చేరగలరని భావిస్తున్నారు.

శాసన సభ్యుడు డాక్టర్ టి. వి. ఎస్. చలపతిరావు ఇక్కడ ముఖ్యమంత్రిని కలుసుకొని విద్యుచ్ఛక్తి కార్మికుల కోర్కెలను నివేదించారు. ఆయన అర్థిక మంత్రి డాక్టర్ చెన్నారెడ్డిని, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ తిమ్మారెడ్డిని, ఉపాధ్యక్షుడు శ్రీ వి. బి. రాజునుకూడా కలుసుకున్నారు.

తన ప్రయత్నాలు ఫలవంతమైనవా అని ప్రశ్నించగా తాను ఆశాభావాన్ని నిజానాదలేదని డాక్టర్ చలపతిరావు జవాబిచ్చారు.

రాజమండ్రి పౌరుల ఇక్కట్లు

రాజమండ్రి, ఫిబ్రవరి 26— పట్టణంలో మొన్న రాత్రి నుంచి విద్యుచ్ఛక్తి సరఫరా ఆగిపోయింది. నిన్న పట్టణ ప్రజలకు త్రాగడానికి మంచినీళ్లుకూడా లభించలేదు.

బియ్యం అమ్మకానికి దెబ్బతగిలింది. చిల్లర వర్తకులు తమవద్ద నిల్వలులేవని తెల్పుతూ బోర్డులు కట్టారు.

అధికారులను విచారించగా మూడు రోజులవరకు విద్యుచ్ఛక్తి సరఫరా పునరుద్ధరణ జరగక పోవచ్చునని తెలియవచ్చింది.

ఆంధ్ర పేపర్ మిల్సునుంచి మునిసిపాలిటీవారు విద్యుచ్ఛక్తిని కొనుగోలుచేస్తే బాగుంటుందని పట్టణవాసులు భావిస్తున్నారు.

రాజమండ్రిలో 20 మంది అరెస్టు

రాజమండ్రి, ఫిబ్రవరి 26— ఆంధ్ర ప్రాంతీయ విద్యుచ్ఛక్తి ఉద్యోగుల సంఘం రాజమండ్రి డివిజనల్ బ్రాంచి అధ్యక్షుడు శ్రీ పెంటకోట రామదాసు, ఉపాధ్యక్షుడు శ్రీ వి. లక్ష్మీనారాయణ, కార్యదర్శి శ్రీ బి. మాధవరావు, హెల్పర్ కె. సుందరరావు రమణమూర్తిలతో 20 మంది ఎలెక్ట్రిసిటీ ఉద్యోగులను ఇండియా రక్షణ నిబంధనల కింద మొన్న రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కడచిన నెల 29 వ తేదీనుంచి ఎలెక్ట్రిసిటీ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు.

చీరాల

చీరాల, ఫిబ్రవరి 26— గుంటూరుజిల్లా చీరాల ప్రాంతం విద్యుచ్ఛక్తి కార్మికుల అత్యవసర సమావేశం మొన్న ఇక్కడ శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కులో శ్రీ ఎం. నుబ్బారావు అధ్యక్షతన జరిగినది. అరెస్టు చేసిన విద్యుచ్ఛక్తి కార్మికులను విడుదల చేయవలెనని సమావేశంలో తీర్మానించారు. విజయం చేకూరేవరకు సమ్మెను కొనసాగించవలెనని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేకూర్చవలసినదిగా ఏకగ్రీవంగా తీర్మానించారు.

విజయనగరం

విజయనగరం, ఫిబ్రవరి 26— స్థానిక విద్యుచ్ఛక్తి పనివారలు 22వ తేదీ ఉదయం శ్రీ కె. వి. కె. జగన్నాథరావు అధ్యక్షతన సమావేశమై, ప్రభుత్వం ఒక ప్రక్క కార్మికుల కోర్కెలు న్యాయమైనవని, చట్టబద్ధమైన పని అంగీకరిస్తూనే, వేరొకప్రక్క కార్మికులను, కార్మికుల నాయకులను నిర్బంధంలో వుంచడం ప్రభుత్వంవైఫరీని తెలియచేస్తున్నదని ఆరోపిస్తూ, అందుకు తమ నిరసనను తెలియచేశారు. తమ కోర్కెలు తీరేవరకు దీక్షతో సమ్మెను నిరవధికంగా కొనసాగించవలెనని వారు కోరారు. కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రభుత్వోద్యోగులు, పురప్రజలు విద్యుచ్ఛక్తి పనివారల కోర్కెలు తీరేవరకు అన్నివిధాల సహాయం చేయవలసినదిగా అభ్యర్థించారు.

రామచంద్రపురం విద్యుచ్ఛక్తి కార్మిక నాయకుల అరెస్టు

తాపేశ్వరం, ఫిబ్రవరి 26— రామచంద్రపురం విద్యుచ్ఛక్తి ఉద్యోగుల నాయకులు శ్రీయుతులు రామదాసు, వెంకటరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావులను 22 వ తేదీ మధ్యాహ్నం అరెస్టు చేశారు. వారి న్యాయమైన కోర్కెలు నెరవేరేవరకు సమ్మెను శాంతియుతంగా కొనసాగించాలని విద్యుచ్ఛక్తి ఉద్యోగులు నిర్ణయించారు.

రామచంద్రపురం తాలూకాలో విద్యుచ్ఛక్తి సప్లయి ఆగిపోయింది. 33 కె. వి. లైన్ నుంచి సప్లయి చేస్తున్న విద్యుచ్ఛక్తి తాపేశ్వరంవద్ద రెండుసారులు గుర్తు తెలియని వ్యక్తులచే విఘాతం కలుగచేయబడింది.

అసిస్టెంటు ఇంజనీరు శ్రీ కె. వివేకానంద స్వయంగా లైన్‌లోకి వెళ్ళి ఇద్దరు సూపర్‌వైజర్ల సహాయంలో విద్యుత్తు లైన్‌ను పునరుద్ధరించారు.

బందరులో అరెస్టులు

మచిలీపట్నం, ఫిబ్రవరి 26—రాష్ట్ర విద్యుచ్ఛక్తి ఉద్యోగులు నిరవధిక సమ్మెచేస్తూ మచిలీపట్నంవద్ద దుర్భర్యలకు పాల్పడ్డారనే ఆరోపణతో ఇష్టర్మెంటు పెకానిక్ శ్రీ తిరునగిరి శ్రీనివాసరావు, వైర్‌మెన్ బి. బందరు ఇన్‌చార్జి పోలీసు ఇన్‌స్పెక్టర్ శ్రీ కె.వి.ఎస్. రెడ్డి ఇండియా రక్షణ నిబంధనల కింద వారిని కస్టడీలోకి తీసుకొని రిమాండులో వుంచారు.

కడచిన ఆదివారం పోయిన విద్యుచ్ఛక్తి మొన్న రాత్రి కొద్దిగంటల తప్ప తిరిగి పునరుద్ధరించబడలేదు. మునిసిపల్ నీటి సప్లయి కూడా మొన్న ఆగిపోయింది. ఇందువల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురయినారు.

పాలకొల్లులో అరెస్టులు

భీమవరం, ఫిబ్రవరి 26— పాలకొల్లు, భీమవరం, మారుపేరు లైన్స్‌లలో పనిచేస్తున్న 73 మంది ఎలెక్ట్రికల్ ఉద్యోగులను మొన్న రాత్రి నర్సాపురం పోలీసు ఇన్‌స్పెక్టర్ దేశరక్షణ నిబంధనలక్రింద అరెస్టుచేశారు.

విధ్వంసకార్యలకు పాల్పడినారన్న ఆరోపణలపై వారిని అరెస్టుచేయడం జరిగింది. అరెస్టుచేయబడిన ఎలెక్ట్రికల్ ఉద్యోగులు (హెల్పర్లు లైన్‌మెన్) పాలకొల్లు సబ్‌డివిజన్‌కు చెందినవారు.

శంఖవరంలో శ్రీ పి. గుర్రాజు మృతి

ఎన్నికల కొట్లాట ఆయనకు కలపరపరిచగా, మెదడు రక్తనాళాలు తెగినట్లు వార్త

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

పిఠాపురం, ఫిబ్రవరి 26— శంఖవరానికి చెందిన ప్రముఖ భూస్వామి, కాంగ్రెసు కార్యకర్త శ్రీ పర్వత గుర్రాజు (54) ఈ నెల 20వ తేదీన హఠాత్తుగా మృతి చెందారు. ఈయనకు నలుగురు కుమారులు, అయిదుగురు కుమార్తెలు, భార్య వున్నారు.

శ్రీ గుర్రాజు 1452 నుంచి 1962 వరకు శాసనసభ్యుడుగా వున్నారు. పి. సి. సి. సభ్యుడు, కాకినాడ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు వైస్-ప్రెసిడెంటు, ప్రత్తిపాడు కోపరేటివ్ ల్యాండ్ మార్టుగేజ్ బ్యాంకు అధ్యక్షులు, ఏటికొప్పాక కోపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీ ప్రొవిన్షియల్ డెలిగేటుగా కూడా సేవలు చేశారు.

ఎన్నికల సందర్భంగా కాంగ్రెసు కార్యకర్తలకు, స్వతంత్ర అభ్యర్థి కార్యకర్తలకు మధ్య శంఖవరంలో 19వ తేదీ రాత్రి సుమారు పది గంటలకు కొట్లాట జరుగుతున్నదనే వార్త విని ఆయన కలతపడి తన చేత మెదడుకు వెళ్ళే రక్తనాళాలు రెండు పోయి వెంటనే స్పృహతప్పి పడిపోయినట్టు తెలుస్తున్నది.

చిత్తూరులో 144 వ సెక్షన్

తిరుపతి, ఫిబ్రవరి 26— కొత్తగా ఏర్పడిన చిత్తూరు మునిసిపల్ హద్దులలో 22 వ తేదీనుంచి 28 వ తేదీవరకు ఊరేగింపులు బహిరంగ సభలను తిరుపతి డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ నిషేధిస్తూ ఉత్తరవు జారీ చేశారు.

ఎన్నికల వివాదాలను నిరోధించడానికి చిత్తూరులో 22వ తేదీనుంచి 28 వ తేదీవరకు 144 వ సెక్షన్‌ను విధించారు.

శ్రీశైలంలో శివరాత్రి ఉత్సవాలు

శ్రీశైలం, ఫిబ్రవరి 26— కర్నూలు జిల్లా శ్రీశైల క్షేత్రంలో వచ్చే నెల ఆరు నుంచి 12వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఏడు రోజుల పాటు ఉపన్యాసాలు, హరికథలు, పురాణ కాలక్షేపాలు, నాదస్వర కచేరీలు తదితర కార్యక్రమాలు జరుగుతాయి.

శ్రీశైల దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు శ్రీ నీలంరాజు వేంకటనరసయ్య ఒక ప్రకటన చేస్తూ శ్రీశైల క్షేత్రం భూరి విరాళాలు వస్తవంనినదిగా భక్తులకు విజ్ఞప్తి చేశారు.

చిత్రకళాభివృద్ధికి రాజమండ్రి కేంద్రంగా సాగుతున్న కృషి

దామెర్ల రామారావు తృతీయ వర్ధంతి సభలో ప్రముఖుల ప్రశంసలు

("ఆంధ్రజ్యోతి" విలేకరి) రాజమండ్రి, ఫిబ్రవరి 26—

చిత్రకళాభివృద్ధికి రాజమండ్రిలో జరుగుతున్న కృషికి మొన్న ఇక్కడ జరిగిన సభలో ప్రముఖులు ప్రశంసించారు.

ఈ సందర్భంగా జరిగిన సభకు ఆంధ్ర "సింగారం" చిత్రానికి ద్వితీయ బహుమతి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీ కె. ఆర్. శ్రీనివాసఅయ్యంగార్ అధ్యక్షత వహిస్తూ, కీర్తిశేషులు శ్రీ దామెర్ల రామారావు చిత్రకళా ప్రతిభను కొనియాడారు.

కార్యదర్శి డాక్టరు దామెర్ల రాజారావు నివేదికను సమర్పిస్తూ తృతీయ అఖిల భారత చిత్రకళా ప్రదర్శనకు 111 చిత్రాలు వచ్చాయని, ఈ స్కూల్‌లో ఫలానా రకం చిత్రకళనే విద్యార్థులకు నేర్పవలెనన్న నిర్బంధం లేదని, విద్యార్థులు చిత్రకళలో శక్తి సామర్థ్యాలను పెంచుకుంటూ తమ అభిప్రాయ వ్యక్తీకరణకు ఏ పద్ధతినైనా అనుసరించవచ్చునని అన్నారు.

శ్రీ శ్రీనివాస అయ్యంగార్ శ్రీ ఎం. రాజారావు వేసిన కీర్తిశేషులు శ్రీ విస్సా అప్పారావు తైలవర్ణ చిత్రాలు ఆవిష్కరిస్తూ, శ్రీ విస్సా అప్పారావు విద్యా, సాంస్కృతిక, నాటక, సంగీత, చిత్రకళలకు చేసిన సేవలను ఆయన ప్రతిభావ్యుత్పత్తులను శ్లాఘించారు, శ్రీయుతులు దామెర్ల వెంకటరావు, డాక్టరు రాజారావు, విస్సా అప్పారావు, పసుపులేటి వెంకటరత్నంగార్లు రామారావు గారిలకోసం, అప్పు స్కూల్‌కోసం చేసిన కృషి గొప్పదని ఆయన ప్రస్తుతించారు.

బి. ఎస్. టి. డి. రిసెర్చి డిప్యూటీ డైరెక్టరు డాక్టరు ఎస్ ఎస్. రెడ్డి చిత్రకళా ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేస్తూ, వివిధ దేశాలలో చిత్రకళకు, దానికి సంబంధించిన గ్యాలరీలకు అధిక ప్రాధాన్య మిస్తున్నారని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న రాజమండ్రి పట్టణంలో ఇలాంటి ప్రదర్శనలలో ప్రదర్శించిన చిత్రాలు ముందుందు బాగా అమ్ముడు కావచ్చునని వక్కాణించారు.

శ్రీమతి ఇందిరా రెడ్డి బహుమతి ప్రదానం చేశారు.

హైదరాబాద్‌కు చెందిన శ్రీ పి. గౌరీశంకర్ "నిరాశ" చిత్రానికి 250 రూపాయల ప్రథమ బహుమతి, రాజమండ్రికి చెందిన శ్రీ వై. ఎస్. ప్రసాద్ చిత్రించిన "సింగారం" చిత్రానికి 150 రూపాయలు, శ్రీ డి. దేవరాజ్, శ్రీ కె. రాజేంద్రన్, శ్రీ ఎం. సీతారామాచార్యుల చిత్రాలకు ఒక్కొక్కరికి వంద రూపాయలు బహుమతులు లభించాయి.

రామారావు ఆర్టు స్కూల్‌లోని విద్యార్థులకు జిల్లాలోని హైస్కూల్ విద్యార్థులకు కూడా చిత్రకళలో పోటీలను నిర్వహించి బహుమతు లిచ్చారు.

ఆర్టు స్కూలు సహాయ కార్యదర్శి శ్రీ కవికొండల శ్రీరామచంద్రమూర్తి వందన సమర్పణం చేశారు.

సముద్ర స్నానానికి వెళ్ళిన విద్యార్థుల దుర్మరణం

నరసాపురంలో అంతర్వేది ఉత్సవాల సందర్భంగా

నరసాపురం, ఫిబ్రవరి 26— పాలకొల్లుకు చెందిన మామిళ్ళపల్లి కుమారుడు మీసాల రంగారావు (18), తాతయ్య కుమారుడు కొండేటి బాబూరావు (19) అనే ఇద్దరు విద్యార్థులు అంతర్వేది ఉత్సవం సందర్భంగా ఇటీవల సముద్రంలో స్నానం చేస్తుండగా వచ్చిన పెద్ద అలలలో కొట్టుకొని పోయి మరణించారు. కొద్దినిమిషాలకు వారి మృతశరీరాలు వడ్డుకు కొట్టుకొని వచ్చాయి. మృత శరీరాలను పాలకొల్లు తీసుకువెళ్ళారు.

పశ్చిమ గోదావరికి చెందిన మరొక యువకుడు వీరితో పాటు అలల తాకిడికి కొట్టుకొనిపోయినా బ్రతికి బయట పడగలిగాడు.

24వ తేదీన నరసింహస్వామి కళ్యాణంతో ప్రారంభమైన అంతర్వేది ఉత్సవం వేలాది యాత్రికులను ఆకర్షిస్తున్నది.

ఆకాశవాణి

మంగళవారం, ఫిబ్రవరి 28

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6.00 వందేమాతరం, సుధోదయం, 6.10 భక్తిరంజని, 6.45 సూక్తిముక్తావళి, 6.50 బజారు ధరలు, 6.55 విరామసంగీతం, 7.00 తెలుగులో వార్తలు, 7.15 ద్వారం భావనారాయణరావు, 7.45 సంగీత శిక్షణ, 8.30 పై. సుబ్రహ్మణ్యం: వేణువు, మ॥11.45 ఉన్నతపాఠశాలలకు, 12.30కార్మికులకార్యక్రమం, 1.00 పనితావాణి, 1.50 తెలుగులో వార్తలు, సా॥ 5.30 స్థానిక ప్రకటనలు, 5.35 లలితసంగీతం, 6.05 ప్రాంతీయ వార్తలు, 6.15 వాద్యబృందం, 6.25 ముఖ్యప్రకటనలు, విరామసంగీతం, 6.30 పందిపిలుపు, 7.00 తెలుగులో వార్తలు, 7.15 దీక్ష, 7.30 రేడియో వార్తావాహిని, 7.45 చిత్రతరంగిణి - ఫిల్మ్ సంగీతం, 8.00 ఉభయ పక్షాలవారి గ్రోతల ఉత్తరాలకు జవాబులు, 8.30 రేడియో న్యూస్‌రీల్, 9.20 విరామ సంగీతం, 9.30 "వెంకటాద్రిస్వామి చరిత్రం" - హరికథ, 10.35 జనగణమన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6.00 వందేమాతరం, మంగళధ్వని, 6.10 భక్తిరంజని, 6.45 సూక్తిముక్తావళి, 6.50 వాద్యగోష్ఠి, 7.00 తెలుగులో వార్తలు, 7.45 సుగం సంగీత్, మ॥ 11.45 ఉన్నత పాఠశాలలకు, 12.30 కార్మికుల కార్యక్రమం, 1.00 పనితావాణి, 1.40 చిత్రపథ్ సే, 1.50 తెలుగులో వార్తలు, 2.00 లలిత సంగీత్, సా॥ 5.30 స్థానిక ప్రకటనలు, 5.35 లలితవాద్య వలి, 6.05 ప్రాంతీయ వార్తలు, 6.25 ముఖ్య ప్రకటనలు, 6.30 గ్రామస్థుల రేడియో గోష్ఠి, 7.00 తెలుగులో వార్తలు, 7.15 దీక్ష, 7.30 రేడియో వార్తావాహిని, 8.00 మీరు కోరిన పాటలు, 9.30 రేడియో న్యూస్ రీల్, 9.30 విజయవాడ వలె 10.40 జనగణమన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్-బి

80.42 మీ (3355 కిలోసై)

ఉ॥ 6.00 హైదరాబాద్ ఎ వలె, మ॥ 11.45 హైదరాబాద్ ఎవలె, 12.30 హైదరాబాద్ ఎ వలె, సా॥ 5.30 హైదరాబాద్ ఎ వలె, 7.00 తెలుగులో వార్తలు, 7.15 హైదరాబాద్ ఎ వలె, 9.20 విరామసంగీతం, 10.40 జనగణమన, ప్రసార సమాప్తి.

మద్రాస్ - ఎ

416.7 మీ (7.20 కిలోసై)

ఉ॥ 6.00 వందేమాతరం, మంగళగానం, 6.40 బజారు ధరలు, 6.45 సంగీతామృతం, 8.30 సంగీత మంజరి, 8.45 గీతమంజరి, 10.30 మధురగీతం, మ॥ 12.00 కార్మికుల కార్యక్రమం, 1.30 వాద్యగోష్ఠి, 1.45 చిత్రగానం, 6.00 విరామ సంగీతం, 7.30 వ్యవసాయదారులకు, 8.45 వాద్యసంగీతం, 10.30 చిత్రగానం, 12.00 జనగణమన, ప్రసార సమాప్తి.

మద్రాస్ - బి

211.6 మీ (1420 కిలోసై)

ఉ॥ 6.00 మద్రాసీ ఎ వలె, 6.45 మద్రాసీ ఎ వలె, 7.00 తెలుగులో వార్తలు, 7.15 సంగీత మంజరి, మ॥ 1.50 తెలుగులో వార్తలు, సా॥6.20స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు 7.00 తెలుగులో వార్తలు, 9.20 విరామ సంగీతం.

క్రీడాభిరామం

కాకినాడలో ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్ షిప్స్ ప్రారంభం

కాకినాడ, ఫిబ్రవరి 26 — కాకినాడ సర్దార్ ఓపెన్ ఛాంపియన్ షిప్స్ అధ్వర్యాన ప్రథమ వార్షిక ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్ షిప్స్ నిన్న సాయంత్రం ప్రారంభమయినాయి. ఈ పోటీలను శ్రీ ముప్పున రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంలో టౌన్ హాల్‌లో జరిగిన ప్రత్యేక సభకు కలెక్టర్ శ్రీ ఎం. అసదుల్లా సయీద్ అధ్యక్షత వహించారు.

ఈ పోటీలు విజయవంతమయినట్లయితే, తాము మరల పెద్ద ఎత్తున పోటీలను నిర్వహించగలమని అతిథులను అహ్వానిస్తూ టోర్నమెంటు కమిటీ అధ్యక్షుడు శ్రీ పైడా వెంకటనారాయణ పేర్కొంటూ, ఈ పోటీల నిర్వహణకు సహకార మందించినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞత లందచేశారు.

వివిధ అటలలో చిన్నచిన్న దేశాలనుంచి ప్రపంచ ఛాంపియన్‌లు పుట్టుకొస్తుండగా ఇంత పెద్ద ఎత్తున జనాభా గల మన దేశం టెన్నిస్ కరువై వుండడం శోచనీయమని పేర్కొంటూ, ఈ పోటీలను నిర్వహిస్తున్నందుకు కమిటీని శ్రీ అసదుల్లా అభినందించారు.

కడచిన సంవత్సరం నిర్వహించిన జిల్లా టోర్నమెంట్సును గురించి కార్యదర్శి డాక్టర్ పి.ఎ.వి. సత్యనారాయణమూర్తి నివేదికను సమర్పించారు. ఈ పోటీలలో మెన్స్ సింగిల్స్‌కు 72 ఎంట్రీలు, మెన్స్ డబుల్స్‌కు 44 ఎంట్రీలు వచ్చాయి.

డాక్టర్ సత్యనారాయణమూర్తి వందన సమర్పణ చేశారు.

విజయనగరంలో టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీలు

విజయనగరం, ఫిబ్రవరి 26 — సిటీక్లబ్ టెన్నిస్ 13 వ పోటీలు ఆంధ్రరాష్ట్ర టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ఏడవ పోటీలు ఇక్కడ జరుగుతున్నాయి.

స్థానిక సిటీక్లబ్బు కార్యదర్శి శ్రీ బి. నారాయణరావు దొర ఈ విషయం తెలియచేస్తూ, టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీలు క్లబ్బు ఆవరణంలో వచ్చేనెల 19 వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, సింగిల్స్, డబుల్స్, జూనియర్ సింగిల్స్, సబ్ జూనియర్ సింగిల్స్, మిక్సెడ్ డబుల్స్, లేడీస్ సింగిల్స్, మిక్సెడ్ డబుల్స్, వెటరన్ సింగిల్స్ పోటీలను నిర్వహిస్తారనిచెప్పారు.

ఎంట్రీలు వచ్చే నెల తొమ్మిదవ తేదీ ముగించి, మరునాడు డ్రా చేస్తారు.

తిరుపతి, కాళహస్తి పట్టణాలలో సభలు, ఊరేగింపుల నిషేధం

కాళహస్తి, ఫిబ్రవరి 26 — కాళహస్తి, తిరుపతి పట్టణాలలో ప్రస్తుతం వున్న ఎన్నికల తీవ్రపరిస్థితి తిరుపతి డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంటు పోలీసు వర్గం 30 (1) కింద, ఉత్తరువు లేకుండా ఎవరు సభలు గాని, ఊరేగింపులుగాని జరపకూడదని నిషేధపు ఉత్తరువులను జారీచేశారు.

వివాహమహోత్సవం

తెనాలి, ఫిబ్రవరి 26 — స్థానిక వర్తక ప్రముఖులు శ్రీ ఉండూరు సత్యనారాయణమూర్తి సౌభాగ్యవతి కమలాదేవికి విజయవాడకు చెందిన ఎస్టేట్ ఇంజనీరు శ్రీ మాటూరి రామమోహనరావు జ్యేష్ఠ పుత్రుడు చిరంజీవి శేషతల్పశాయికి కన్యాదాత సంగ్రహంలో 22 వ తేదీ రాత్రి వివాహమహోత్సవం వైభవోపేతంగా జరిగినది.

ఆంధ్రప్రదేశ్‌నుంచి లోకసభకు ఎన్నికైన కాంగ్రెసు అభ్యర్థులు

శ్రీ పెండేకంటి వెంకట సుబ్బయ్య

శ్రీమతి టి. లక్ష్మీకాంతమ్మ

గన్నవరంలో కాంగ్రెస్ విజయోత్సవాలు

గన్నవరం, ఫిబ్రవరి 26 — గన్నవరం నియోజకవర్గం గత వదిహేను సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీ ఆధీనంలో వున్నది. ఈ సారి అది కాంగ్రెసు చేతిలోకి రావడంతో నియోజకవర్గంలోని ఇంచుమించు ప్రతి గ్రామంలోను కాంగ్రెసు కార్యకర్తలు విజయోత్సవం జరుపుకుంటున్నారు.

కాంగ్రెసు అభ్యర్థి శ్రీ వెలివెల సీతారామయ్య విజయవార్త తెలియగానే ఓట్ల లెక్కింపు జరిగిన నూజివీడు నుంచి ఆయనను పెద్ద ఊరేగింపుతో తేలప్రోలు, కానుమోలు మొదలైన గ్రామాలలో ఊరేగించారు. ఈఊరేగింపులో తొమ్మిది లారీలు, ఎన్నెంకు చిన్న కారుల నిండా పెక్కుమంది కార్యకర్తలు పాల్గొన్నారు. కొండపావులూరు, పురుషోత్తమపట్నం గ్రామాలలో కూడా కాంగ్రెసు అభ్యర్థికి సన్మానాలు, సత్కారాలు జరిగాయి. ఒక రైతు కాంగ్రెసు విజయం పట్ల సంతోష సూచకంగా రూపాయి నోట్లతో దండగుచ్చి రాగా శ్రీ సీతారామయ్య మెడలో వేశారు.

శ్రీ కోన ప్రభాకరరావుకు బాపట్లలో అభినందన సభ

బాపట్ల, ఫిబ్రవరి 26 — బాపట్ల నియోజకవర్గంనుంచి శాసనసభకు కాంగ్రెసు అభ్యర్థిగా ఎన్నికైన శ్రీ కోన ప్రభాకరరావును అభినందించే నిమిత్తం 23 వ తేదీ రాత్రి స్థానిక ఎస్, జి ఓ హోమ్ ఆవరణలో బహిరంగసభను ఏర్పాటు చేశారు. శ్రీ చెరువు శివరామశాస్త్రి సభకు అధ్యక్షత వహించారు. పట్టణ కాంగ్రెసు, యువజనకాంగ్రెసువర్తక, మహిళా సంఘాల తరపున ప్రభాకరరావుకు పూలదండలు వేశారు. డాక్టరు స్థానం పార్థసారథి, శ్రీయుతులు వి. ఎల్ సుందరరావు, బొడ్డుపల్లి సుబ్బయ్య, ఎల్ టి. మనోహరరావు, ధనుంజయరావు, కాశ వెంకటేశ్వర్లు, పోగిడదండ సత్యనారాయణ బతం అంజనేయులు మాట్లాడుతూ ప్రభాకరరావు గడచిన ఏడు సంవత్సరాలుగా మామూలు కాంగ్రెసు కార్యకర్తగాఉంటూకాంగ్రెసుకు, నియోజకవర్గానికి ఎనలేని సేవచేశారని ఆయనకు లభించిన అఖండవిజయం ప్రజాదరణకు చిహ్నమనిపేర్కొంటూ ప్రభాకరరావు తగుపద్ధంగా కృతజ్ఞతలు చెప్పారు.

విజయనగరం

విజయనగరం, ఫిబ్రవరి 26 — ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ పి. వి. జి. రాజు భీమిలీ నియోజకవర్గం నుంచి కాంగ్రెసు అభ్యర్థిగా గెలుపొందిన వార్త తెలియగానే స్థానిక ప్రజలు విజయోత్సాహాన్ని ప్రకటించారు. శ్రీ పి. వి. జి. రాజును విజయనగరంలో సన్మానించేందుకు నిన్న ఇక్కడ శ్రీ ఎ.ఎ ఆర్. మూర్తి అధ్యక్షతన జరిగిన హరిజన, వివిధ వెనుకబడిన జాతుల కార్యకర్తల సభలో తీర్మానించారు. శ్రీ మూర్తి అధ్యక్షతన సన్మాన సంఘాన్ని ఏర్పాటు చేశారు.

వివిధ రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

[ఆదివారం సాయంత్రం 4-30 గంటల పరిస్థితి]

రాష్ట్రం	మొత్తం సీట్లు	ప్రకటించిన ఫలితాలు	కాంగ్రెసు	స్వతంత్ర పార్టీ	జనసంఘం	కమ్యూనిస్టు (మితవాద)	కమ్యూనిస్టు (అతివాద)	రిపబ్లికన్	పి.ఎస్.పి.	ఎస్.ఎస్.పి.	ఇతర పార్టీలు	ఇండిపెండెంటు
ఆంధ్రప్రదేశ్	287	287	165	27	9	10	9	2	—	1	—	67
అస్సాం	126	123	73	2	—	7	—	—	4	5	8	24
ఒరిస్సా	140	129	29	49	—	6	1	—	17	2	16	1
మధ్యప్రదేశ్	296	294	167	7	77	1	—	—	9	10	—	23
రాజస్థాన్	184	176	85	47	22	—	—	—	—	8	—	14
బీహార్	318	315	125	4	26	24	6	1	17	67	16	47
గుజరాత్	168	167	92	64	1	—	—	—	3	—	2	6
ఉత్తరప్రదేశ్	425	422	198	12	97	14	1	9	11	43	—	37
పంజాబు	104	104	48	1	9	5	3	1	—	—	26	9
హరియానా	81	81	48	3	12	—	—	2	8	1	16	19
మహారాష్ట్ర	270	269	202	—	4	10	1	5	8	4	26	16
మద్రాసు	234	227	49	19	—	2	11	—	6	2	133	4
కేరళ	133	133	9	—	—	19	53	—	—	19	28	5
మైసూరు	216	216	126	16	4	1	1	2	20	6	2	36
పశ్చిమబెంగాల్	280	259	119	1	1	16	36	—	6	7	30	10
జమ్మూ-కాశ్మీర్	75	24	23									
కేంద్రపాలిత ప్రాంతాలు:												
మణిపూర్	30	11	6	—	—	1	—	—	—	2	1	2
త్రిపుర	30	23	22	—	—	—	—	—	—	—	1	—
హిమాచల్‌ప్రదేశ్	60	49	31	—	7	1	—	—	—	—	—	9
ఢిల్లీ	56	37	12	—	23	—	—	—	—	—	—	2
పుదుచ్చేరి	30											
చండీఘర్												
లక్కదీవులు												

ఏ రాష్ట్రానికి ఎవరు ముఖ్యమంత్రి?

(నిన్నటి సంచిక తరువాయి)

మధ్యప్రదేశ్

మధ్యప్రదేశ్‌లో ఈ సారి కాంగ్రెసుకు మెజారిటీవస్తుందని చాలామంది భావించలేదు. ఇక్కడ స్వతంత్రపార్టీ, జనక్రాంతి దళ్ పార్టీల మిశ్రమ మంత్రివర్గం ఏర్పడవచ్చునని అందరు భావించారు.

ఒక ప్రక్క ఎన్నికలు జరుగుతుండగానే అక్కడ స్వతంత్రపార్టీ, ఇతర ప్రతిపక్షాలవారు మిశ్రమమంత్రివర్గ నిర్మాణంపై సంప్రతింపులు ప్రారంభించారు. కాని, ఫలితం తలక్రిందులైనది.

ఇటీవలి కాలంలో మధ్యప్రదేశ్‌కు సుసీర నాయకత్వం లభించలేదు. రవిశంకర్ శుక్లా తరువాత అంతటి నాయకుడు దానికి దొరకలేదు. ఆయన తరువాతవచ్చిన డాక్టర్ కట్జూ, శ్రీ బి. ఆర్. మండ్లాయ్‌లు ఆ రాష్ట్రానికి సుస్థిర నాయకత్వాన్ని ప్రసాదించలేకపోయారు, అందువల్ల, మధ్యప్రదేశ్‌లో ఈ ఎన్నికలలో కాంగ్రెసు ఓటమి తథ్యమని భావించబడుతున్న తరుణంలో రాష్ట్రానికి శ్రీ ద్వారకా ప్రసాద్ మిశ్రా నాయకత్వం లభించింది, కాగా, మొన్నటి ఎన్నికలలో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెసుకు విజయం చేకూర్చిన ఘనత శ్రీ డి. పి. మిశ్రాకే చెందాలి.

మధ్యప్రదేశ్ కాంగ్రెసులోని శ్రీ మిశ్రా ప్రత్యర్థులందరు సంస్థను విడిచి బయటికి వెళ్ళిపోయారు. మొన్నటివరకు కాంగ్రెసులో వున్న గ్వాలియర్ మహారాణి విజయరాజే సింధియా ఈ సారి కాంగ్రెసుపై కత్తి కట్టింది.

ఆమె ఈసారి ముఖ్యమంత్రి కావలదని ఎన్నికలకు ముందు చాలా మంది భావించారు, కొన్ని పత్రికలు కూడా అలాగే వ్రాశాయి కాని, అంచనాలన్నీ తలక్రిందులైనాయి.

ఇప్పటి పరిస్థితులలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కాంగ్రెసుకు విజయం నాడించిన శ్రీ మిశ్రాయే పదవిలోని అధిష్ఠించగలరని చెప్పవచ్చు. ఆయన కేంద్రంలోకి పదవిలోనున్న ఊహాగానం ఒకటి వుంది. అది జరిగితే తప్ప, అయనే తిరిగి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి అని చెప్పవచ్చు. శ్రీ మిశ్రా కేంద్రానికి వెళ్ళే అవకాశాలు చాలా తక్కువ.

రాజస్థాన్

ఈ సారి రాజస్థాన్‌లో కాంగ్రెసు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని స్వతంత్రపార్టీ నాయకులు చెప్పారు. అక్కడి స్వతంత్ర పార్టీ, జనసంఘం కలిసి ఎన్నికల ఒప్పందం చేసుకుని, ఎన్నికల తరువాత తాము మిశ్రమ మంత్రివర్గాన్ని స్థాపించగలమని ఓటర్లకు స్పష్టం చేశాయి రెండు పార్టీల నాయకులు కలిసి సమష్టిగా పర్యటించారు కూడా. ఈ మిశ్రమ మంత్రివర్గానికి జయపూర్ మహారాణి గాయత్రీదేవి ముఖ్యమంత్రి కాగలదని కూడా ఊహించబడింది. రాజస్థాన్‌కు కాబోయే ముఖ్యమంత్రిగా ఆమె చిత్రాన్ని కూడా ఒక బొంబాయి వారపత్రిక ప్రకటించింది.

అయితే, ఇక్కడ కూడా పరిస్థితి పూర్తిగా తారుమారయింది. గాయత్రీదేవి అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయింది. ఆమె ఒకవేళ లోకసభకు వెళ్ళినా, మిశ్రమ మంత్రివర్గం ఏర్పడితే దానికి నాయకుడు దుంగార్‌పూర్ మహారాజా ముఖ్యమంత్రి కాగలడని భావించారు.

అయితే, ఇప్పుడు కాంగ్రెసులో నలుగురు ఇండిపెండెంట్లు కూడా చేరడంతో అక్కడ కాంగ్రెసు మంత్రివర్గ నిర్మాణానికి అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెసు పార్టీకి శ్రీ సుఖాడియా ఏకగ్రీవంగా నాయకుడుగా ఎన్నికైనందున, రాజస్థాన్‌లో తిరిగి కాంగ్రెసు మంత్రివర్గమే ఏర్పడితే దానికి ముఖ్యమంత్రి శ్రీ సుఖాడియాయేనని చెప్పనక్కరలేదు.

గుజరాత్

గుజరాత్‌లో కూడా ఈ సారి కాంగ్రెసు గెలవబోదని చాలామంది భావించారు. తమ ప్రభుత్వం ఏర్పడే రాష్ట్రాలలో గుజరాత్ కూడా ఒకటి అని స్వతంత్రపార్టీ నాయకులు అంచనా వేశారు. అక్కడ మాజీ డిప్ ఇంజినీర్ 80 సంవత్సరాల వయస్సుగల శ్రీ భాయ్‌లాల్ భాయ్‌పటేల్ స్వతంత్రపార్టీ తరపున ముఖ్యమంత్రి కాలడని భావించారు. అలా అని ఆయన పొటాను కూడా ఒక పత్రిక ప్రచురించింది.

అయితే, గుజరాత్‌లో కూడా పరిస్థితి మారింది, అక్కడ కాంగ్రెసుకు మెజారిటీ చేకూరింది, అక్కడికూడా ఇప్పటివరకు ముఖ్యమంత్రి శ్రీ హితేంద్ర దేశాయికి పోటీ కనిపించడంలేదు. అతి కొద్ది నిమిషంలో ఏదైనా మార్పు జరిగితే తప్ప, తిరిగి ఆయన ముఖ్యమంత్రి కావడానికి హెచ్చు అవకాశాలు కనిపిస్తున్నాయి.

మహారాష్ట్ర

మహారాష్ట్రలో కాంగ్రెసుకు ఎప్పుడూ మెజారిటీ వస్తున్నది, ఈసారి కూడా అక్కడ కాంగ్రెసుకు అఖండ విజయం చేకూరింది. అందువల్ల మామూలు పరిస్థితులలో ఇప్పటి ముఖ్యమంత్రి శ్రీ వి. పి. నాయక్ తిరిగి ఆ పదవిని చేపట్టవచ్చునని భావించవచ్చు.

అయితే ఇక్కడ ఒక సమస్య వుంది. మహారాష్ట్రలో మూడు ప్రాంతాలు వున్నాయి. అవి: మాజీ బొంబాయి రాష్ట్రంలోని మహారాష్ట్రప్రాంతం, వెనుకటి మధ్యప్రదేశ్‌లోని విదర్భ ప్రాంతం, మాజీ హైదరాబాద్ రాష్ట్రంలోని మరాఠ్వాడా.

ముఖ్యమంత్రి పదవిని తొమ్మిదు ప్రాంతాలవారు వరుసగా అధిష్ఠించాలని ఒక సంప్రదాయం ఏర్పడింది. ఈ లెక్కప్రకారం లోగడ చవాన్ (మహారాష్ట్ర), కన్నంవార్ (విదర్భ) ఇప్పుడు వి. పి. నాయక్ (మరాఠ్వాడా) ముఖ్యమంత్రి పదవిని అధిష్ఠించారు.

ఈ సంప్రదాయం ప్రకారం ఈసారి తిరిగి మహారాష్ట్ర ప్రాంతీయుడే ముఖ్యమంత్రి కావలసివాడం ఒకటి వస్తుంది. శ్రీ నాయక్ మహారాష్ట్ర ప్రాంతీయుడు కాదుకదా!

అలాంటి అవాంతరం ఏదో వస్తే తప్ప మామూలు పరిస్థితిలో శ్రీ నాయక్ తిరిగి ముఖ్యమంత్రి కావడానికే హెచ్చు అవకాశాలున్నాయి

పంజాబ్

పంజాబ్‌లో కాంగ్రెసు విజయం పొందినట్లయితే, ఇప్పటి ముఖ్యమంత్రి శ్రీ ముసావిర్ తిరిగి ముఖ్యమంత్రి అయి వుండేవాడు. అయితే అక్కడ కాంగ్రెసుకు పూర్తి మెజారిటీ రాలేదు; ముసావిర్ ఓడిపోయాడు కూడా.

పంజాబ్‌లోని 104 అసెంబ్లీ సీట్లలోను కాంగ్రెసుకు 48 సీట్లు వచ్చాయి. అంటే పూర్తి మెజారిటీకి అయిదు సీట్లే తక్కువ. ఇతర పార్టీలలో ఏ ఒక్కదానికి కూడా పట్టుమని పదిసీటు రాలేదు. అక్కడ స్వతంత్ర పార్టీకి ఒకటి జనసంఘానికి తొమ్మిది సీట్లు, మితవాద కమ్యూనిస్టులకు అయిదు, అతివాదులకు మూడు వచ్చాయి.

కాకపోతే, అకాలీవర్గాలకు కొన్నిసీట్లు వచ్చాయి.

మరి ఇలాంటి పరిస్థితులలో అక్కడ కాంగ్రెసు మంత్రివర్గ నిర్మాణానికియత్నించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ ముఖ్యమంత్రి ఎవరన్న ప్రశ్న చాలా క్లిష్టమైనది.

పాటియాలా మహారాజా రంగంలో ప్రవేశించేటట్టు కనిపిస్తున్నది. ఆయన మొన్నటి ఎన్నికలలో పంజాబ్ అసెంబ్లీకి ఇండిపెండెంటుగా పోటీ చేసి గెలిచారు. ఆయనకు కాంగ్రెసు పోటీ పెట్టలేదు, రాష్ట్రంలో ఆయనకు మంచి పలుకుబడివుంది, కాంగ్రెసు వారు లక్ష, అకాలీవర్గాలకుకూడాఆయన యిష్టుడు. పాటియాలా మహారాజా కాంగ్రెసు అధిష్ఠానవర్గ సభ్యులతో ఢిల్లీలో చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తున్నది, పంజాబ్‌లో ఇండిపెండెంట్లను కలుపుకుని కాంగ్రెసు మంత్రివర్గ నిర్మాణానికి యత్నిస్తే, ముఖ్యమంత్రి కావడానికి అవకాశాలున్నవారిలో పాటియాలామహారాజాను కూడా ఒకరుగా పేర్కొనవచ్చు.

హర్యానా

హర్యానాలో కాంగ్రెసు గెలుస్తుందని మొదటినుంచి అనుకుంటున్నదే. ఇక్కడ ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ భగవత్‌దయాళ్ శర్మ తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రయత్నిస్తున్నారు ఆయనకు తీవ్రమైన ప్రత్యర్థులు లేరనేచెప్పాలి. ఎందువల్లనంటే, ఇటీవలనే ఆయన ప్రత్యర్థులందరిని ఎదుర్కొని ముఖ్యమంత్రి కాలిగారు. శ్రీ శర్మ సమర్థుడని కూడా పేరుపొందారు.

కాశ్మీర్

కాశ్మీర్‌లో కాంగ్రెసు విజయాన్ని గురించి ఎవ్వరు అనుమానించలేదు. ఇప్పటి ముఖ్యమంత్రి శ్రీ సాదిక్‌కు పార్టీ వెలుపల తీవ్ర ప్రత్యర్థులే వున్నా, పార్టీలో ఆయనకు ప్రత్యర్థులు లేరనే చెప్పాలి. అందువల్ల ఈ సారి కూడా తిరిగి శ్రీ సాదిక్ ముఖ్యమంత్రి కావడంలో ఆశ్చర్యం వుండదు.

—టి

భారత ఎన్నికల ఫలితాలు

లండన్‌లోని భారతీయులు, బ్రిటిష్ పౌరుల అమిత ఆసక్తి

లండన్, ఫిబ్రవరి 26 — భారత జనరల్ ఎన్నికల ఫలితాలను తెలుసుకొనడానికి ఇక్కడికి భారతీయులు, బ్రిటిష్ పౌరులు ఇండియా హౌస్‌కు వచ్చి అక్కడ ప్రత్యేక బోర్డుపై అంటించిన భారత ఎన్నికల ఫలితాలు చూచి వెడుతున్నారు.

టెలిఫోన్ మీదుగా కూడా ఇండియన్ హైకమిషన్ సిబ్బందిని ఎన్నికల ఫలితాల గురించి అడుగుతున్నారు.

లండన్‌లోని భారతీయులు తమ దేశపు ఎన్నికలపట్ల ఆసక్తిని చూపడం ఏమాత్రం ఆసహజంకాదుకాని బ్రిటిష్‌వారు కూడా ఈ ఎన్నికల ఫలితాలపట్ల అమిత ఆసక్తిని చూపడం తమకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని భారత హైకమిషన్ సభ్యులు ఒకరు అన్నారు.

ఆర్. టి. సి. వారి సాంస్కృతిక ఉత్సవాలు

గుంటూరులో సమాప్తి

విజయవాడ, ఫిబ్రవరి 26 — ఇటీవల ఆంధ్రప్రదేశ్ స్టేట్‌రోడ్ ట్రాన్స్‌పోర్టు రిక్రియేషన్ క్లబ్బువారు గుంటూరు సేల్ ఎరకరాం శ్రీ కిషన్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో తృతీయ సాంస్కృతిక వార్షికోత్సవాలను నిర్వహించిన సందర్భంగా ఈ కింది బహుమతులను ఇచ్చారు:

నాటకాలు: ఉత్తమ ప్రదర్శన: "భయం" గుంటూరు డివిజన్. ద్వితీయ ప్రదర్శన: "అరణి" కృష్ణాడివిజన్. నటుడు: శ్రీ టి. వి. నాజరయ్య. ద్వితీయ నటుడు: శ్రీ యిమ్మణ్ణి సూర్యనారాయణ సహాయ నటుడు: శ్రీ జె. కిషన్‌సింగ్. హాస్య నటుడు: శ్రీ అవుకు అమ్మిరెడ్డి.

నాటికలు: ఉత్తమ ప్రదర్శన: "శిరోమణి" సిటీ డివిజన్. ద్వితీయ ప్రదర్శన: "రాజీవం" చీరాల డిపో. నటుడు: శ్రీ ఎం. లక్ష్మీపతి. ద్వితీయ నటుడు: శ్రీ ఎన్ నరసింహారావు.

ఏకపాత్రాభినయం: ప్రథమబహుమతి: "రిక్షావాలా" పాత్రధారి శ్రీ కె. వి. శాస్త్రి, భీమవరం; ద్వితీయ బహుమతి: "వెంకన్న పంతులు" పాత్రధారి శ్రీ ఎన్. వివేకానంద, గుంటూరు.

విజయవాడ, ఫిబ్రవరి 26 — డాక్టరు పంభంమెట్టు విష్ణువర్ధనరావు షష్ట్యబ్ది సందర్భంగా 28 వ తేదీ సాయంత్రం అయిదు గంటలకు స్థానిక బెజవాడ మెడికల్ అసోసియేషన్ భవనంలో శాసనసభ్యులు డాక్టరు టి.పి.ఎస్. చలపతిరావు అధ్యక్షతన సన్మాన సభ జరుగుతుంది. పెక్కుమంది ప్రముఖుల ఉపన్యసిస్తారు.

నంద్యాలలో దేవాలయాలు

శ్రీ శంకరాచార్యచే శంకుస్థాపన

నంద్యాల, ఫిబ్రవరి 26 — జగద్గురు కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకరాచార్య సంజీవనగర్ కాలనీలో నిర్మించనున్న శివాలయం, రామాలయం, కళ్యాణ మండపాలకు శంకుస్థాపన చేశారు.

వీటి నిర్మాణాలకు పట్టణ ప్రముఖులు సుమారు లక్ష రూపాయల భూరి విరాళాలను సమర్పించారు. స్వామి సమక్షంలో శ్రీయుతులు యలిశెట్టి కొండయ్య 25 వేల రూపాయలు, బొగ్గరపు బాల నాగయ్య రు. 10,116లు, కుమ్మితి సుబ్రహ్మణ్యం రు. 11,116 లు, కుమ్మితి శివనాగయ్య అయిదు వేల రూపాయలు, నెరవాటి కృష్ణమూర్తి, తొన్నంగడ్డ సుబ్బరాయుడు, వల్లంకొండ నారాయణ సన్సు, గొళ్ళ వెంకట నారాయణ సోదరులు, బచ్చు రామకృష్ణయ్య, కటికం నాగిశెట్టి, అచ్యుత రామకిటయ్య, బొగ్గరపు పుల్లయ్య, నాగయ్య, బొగ్గరపు కృష్ణయ్య, ఇట్లూరి తిరుపతయ్య, విచ్చెన మెట్ల సుబ్బమ్మ, ఎస్. బి, వెంగన్న, బి. ఎల్. గుప్త, చింతకుంట బాలిరెడ్డి మొత్తం 32 వేల అయిదు వందల రూపాయలను ఇచ్చినట్టు ప్రకటించారు.

శ్రీ శంకరాచార్య కోటలో గల శ్రీ మహానందీశ్వర స్వామి దేవాలయంలో సంధ్యేశాన్ని వినిపించి, మహానంది క్షేత్రంలో ఏర్పాటు చేసిన షష్టపంది హోమం ఉత్సవంలో పాల్గొనడానికి వెళ్ళారు. స్థానిక శ్రీ భగవత్ సేవా సమాజ్‌వారు స్వామికి ఘనంగా వీడ్కోలు ఇచ్చారు.

విశ్వకర్మ జయంతి

తెనాలిలో సభ

తెనాలి, ఫిబ్రవరి 26 — మొన్న ఇక్కడ శ్రీమతి కాళీగోవిందమ్మ సమేతంగల శ్రీ విశ్వకర్మ దేవాలయ పాలక బృందం వారు విశ్వకర్మ జయంత్యుత్సవాన్ని జరిపారు. సభకు శ్రీ చిర్రావూరు నాగభూషణాచార్యులు అధ్యక్షత వహించారు. "దర్శనాచర్య" శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు, శ్రీయుతులు పామర్తి నాగభూషణశర్మ, మంగిణాపురపు దక్షిణామూర్తి, ఫణితపు మార్కండేయులు, స్వర్ణ సుబ్రహ్మణ్యకళ శిల్పశాస్త్ర రహస్యాలనుగురించి మాట్లాడారు.

విశ్వకర్మ జయంతికి పబ్లిక్ సెలవు ప్రకటించవలెనని, అన్ని రాష్ట్రాలలోని విశ్వకర్మ తత్వజ్ఞులయిన పండితులచే శాస్త్ర సమ్మతమయిన ఒకే రోజును ఇందుకు నిర్ణయించవలెనని వీరు సూచించారు.

అత్తిలి, ఫిబ్రవరి 26 — పశ్చిమ గోదావరిజిల్లా పంచాయతీ సిబ్బంది సంఘం సర్వసభ్య సమావేశం 26వ తేదీ ఉదయం ఏలూరు తాడేపల్లిగూడెం కర్నూల్ సత్రంలో జరుగుతుందని ఉపాధ్యక్షులు శ్రీ నిండవోలు సూర్యనారాయణ తెలియచేశారు.

పల్లెలు - పట్టణాలు

బరంపురం. ఇటీవల స్థానిక ప్రకాశం హాలులో బరంపురం బ్యాంకి ఎంప్లాయీస్ అసోసియేషనువారు శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ రచించిన "ఇడేమిటి?" అనే సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ఇందులోని పాటలను శ్రీ ఎ. వి. బి. లక్ష్మీనాథ్ రచించారు. శ్రీయుతులు ఏ భాస్కర్‌రావు, పి. వి. బి. లక్ష్మీనాథ్, వి. కామేశ్వరరావు ఎ.ఎల్.ఎస్. నారాయణరావు, కె. సుభద్రరావు, వి. మధుసూదనరావు రమేష్ మార్, శ్రీమతి రాణి నటించారు. ప్రముఖ కథారచయిత శ్రీ అవసరాల రామకృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయారు.

రాజమండ్రి: స్థానిక డాక్టర్ ఎన్. వి. రంగయ్య చౌదరి అమెరికాలో వైద్యశాస్త్రంలో 18 నెలలు శిక్షణపొంది తిరిగి వచ్చిన సందర్భంగా 20 వ తేదీ సాయంత్రం తమ రామలక్ష్మి నర్సింగ్ హోమ్‌లో మిత్రులకు తేనీటివిందు చేశారు. ఆ సందర్భంగా అమెరికాలో తాము అభ్యసించిన వైద్యశాస్త్రం గురించి ఆయన ప్రసంగించారు. డాక్టరు రమణా రంగయ్య చౌదరి కృతజ్ఞతలు తెలియజేశారు.

వరంగల్లు: ఇక్కడి పోర్టురోడ్డు శ్రీఅకారపు గురువరణం తోటలో నిర్వహిస్తున్న కాకతీయ ప్రకృతి చికిత్సాలయాన్ని ఇటీవల శ్రీ ఏకీరువందు మహారాజా సందర్శించారు. డాక్టరు కృష్ణమూర్తి స్వాగతమిచ్చారు. దాలు దయాల్ మహర్షి శివభరత్ లాల్ చిత్రపటాన్ని మహారాజా ఆవిష్కరణ గావించారు. ఆచార్య చందా కాంతయ్య ఉపన్యసించారు. కార్యదర్శి శ్రీ కూచన రాజేశ్వరు ధన్యవాదాలతో సమావేశం ముగిసినది.

పెదపూడి మహిళా సమాజం నూతన కార్యవర్గం ఎన్నిక

తెనాలి, ఫిబ్రవరి 26 — పెదపూడి మహిళా సమాజం సమావేశం శ్రీమతి శరణు కమలాదేవి అధ్యక్షతన మొన్న జరిగినది. ఈ కింది వారిని సంఘం పాలక వర్గానికి కొత్తగా ఎన్నుకొన్నారు:

అధ్యక్షులు: శ్రీమతి చదలవాడ సీతా మహాలక్ష్మి, ఉపాధ్యక్షులు: శ్రీమతి శాస్త్రి అచ్చమ్మ, శ్రీమతి చదలవాడ బుల్లెమ్మి, ప్రధాన కార్యదర్శి: శ్రీమతి తుమ్మల కమలాదేవి, సహాయ కార్యదర్శి: శ్రీమతి అలవాటి రామశేషమ్మ, కోశాధికారి: శ్రీమతి శాస్త్రి వసుజాక్షి, సభ్యులు: శ్రీమతులు గగిని పుష్పావతి, దేవులపల్లి శ్రీకాంతమ్మ, రావెల రమాదేవి, పూలిపాళ్ళ బసవమ్మ, కాకుమాను రామమ్మ, కొలకలూరి భాగ్యమ్మ.

శ్రీశైలంలో పీఠాధిపతి

మార్కాపురం, ఫిబ్రవరి 26 — శ్రీశైల క్షేత్రంలో ఈ నెల 26వ తేదీ నుంచి నెల రోజులపాటు కంచికామకోటి మఠాధిపతి జగద్గురు శ్రీ శంకరాచార్య వుంటారు.


తెగుళ్ళు మీ పంటలను
ఈ విధంగా నివ్వకండి
కాలమే ధనము కాని పంటలు నిజమైన ధనము
తెగుళ్ళను దూరంగా ఉంచుటకు సులభమార్గము
మీ సస్య సంరక్షణకు ఎఐయిమ్ తో
ఎండ్రిన్, సబ్‌మార్ మరియు
డిగ్‌మార్ ఉపయోగించండి
భారతదేశంలో తయారుచే